# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 330 | విశాఖపట్నం | 30-8-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 330 | VISAKHAPATNAM | 30-8-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay


Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



3లో

పక్కదారి పడుతున్న 45 గ్యాస్ సిలిండర్లను పట్టుకున్న లబ్దిదారులు..

## టూరిజం హబ్‌గా 'సీలేరు'?



7లో



6లో

పిల్లల్లో బీపీ రావడానికి కారణాలేమిటి?

## గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిది: చంద్రబాబు

**అరకులోయ, పతాకం న్యూస్:** ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో 10 ఆరోగ్య రథాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని స్పష్టం చేశారు. "సంజీవని" యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్?ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు



మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ (తరువాయి 2వ పేజీలో)

## బొప్పరాజు తీరు అనుమానం కలిగిస్తోంది: అనగాని



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహారశైలిపై రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన ఉద్యోగుల సమస్యల అజెండాతో కాకుండా, ఒక స్పష్టమైన రాజకీయ అజెండాతో పనిచేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వా నికి, ఉద్యోగులకు మధ్య సత్సంబంధా లను చెడగొట్టేలా (తరువాయి 4వ పేజీలో)

## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ: రవీంద్ర



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నేపాల్ జల ప్రళయం.. ప్రపంచానికి ప్రకృతి ఇచ్చిన వార్నింగ్ !

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భూమి మండితే.. మంచు కొండలు విరిగితే.. మనిషి నాగరికత ఎంత నిస్సహాయమో చూపించిన హిమాలయ విలయం ఇది. ఒక్కసారిగా కొండ విరిగిపడింది... మంచు, రాళ్లు, బురద.. కోట్ల లీటర్ల నీరు ఒకేసారి లోయల్లోకి దూసుకొచ్చింది... ప్రశాంతంగా ప్రవహిస్తున్న నది.. క్షణాల్లో ప్రళయ ప్రవాహంగా మారిపోయింది... బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి...రోడ్లు మాయమ య్యాయి... ఇళ్లు నేలమట్టమయ్యాయి... ప్రాణాలు కాపాడుకోవ డానికి ప్రజలు పరుగులు తీశారు... హాలీవుడ్ గ్రాఫిక్స్ సినిమాలో కనిపించే విధ్వంసం... ఈ సారి నిజ జీవితంలో కనిపించింది... ఇది సినిమా కాదు... ఇది నేపాల్‌లో జరిగిన ప్రకృతి విలయతాండవం!





డాక్టర్ శ్రీనివాస్ లెక్కల

పతాకం న్యూస్ చీఫ్ ఎడిటర్

7097975757

### అసలు మనం నేపాల్‌ను చూసి ప్రపంచం ఏం నేర్చుకోవాలి?

ప్రకృతిని జయించామని మనిషి అనుకోవచ్చు... కానీ ప్రకృతి ఒక్కసారి తిరగబడితే నాగరికత ఎంత చిన్నదో నేపాల్ చూపించింది. హిమాలయాల్లో జరుగుతున్న మార్పులు కేవలం నేపాల్ సమస్య కాదు. ఇది భారత్‌తో పాటు మొత్తం దక్షిణాసియాకు ఒక భారీ హెచ్చరిక. ప్రశ్న ఒక్కటే... నేపాల్‌లో జరిగిన విపత్తు నుంచి ప్రపంచ దేశాలు పాఠం నేర్చుకుంటాయా? లేక...మరో విపత్తు వచ్చిన తర్వాతే మేల్కొంటాయా ?

### అసలు నేపాల్‌లో ఏం జరిగింది?

నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతం... ఎత్తైన హిమాలయ పర్వతాలు... వేల అడుగుల ఎత్తులో మంచు, రాళ్లతో కూడిన భారీ భాగం అస్థిరంగా మారడం... అకస్మాత్తుగా విరిగిపడటం... ఆ తర్వాత జరిగిన పరిణామాలు అత్యంత భయానకంగా మారాయి. మంచు,రాళ్లు,మట్టి, నీరు... ఇలా అన్నీ కలిసి ఒక భారీ ప్రవాహంగా లోయల్లోకి దూసుకొచ్చాయి. చిన్న నది ఒక్కసారిగా రాక్షస ప్రవాహంగా మారింది. దాని దారిలో వచ్చిన...గ్రామాలు,రహదారులు, వంతెనలు, హైడ్రో పవర్ ప్రాజెక్టులు, వాహనాలు పర్యాటక ప్రాంతాలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి.

### నేపాల్ ను కకావికలం చేసిన ఫ్లాష్ ఫ్లడ్ అంటే ఏంటి...?

సాధారణ వరదకు ముందు కొంత సమయం ఉంటుంది. వర్షాలు పడతాయి... నదులు నిండుతాయి... నీటి మట్టం పెరుగుతుంది... కానీ ఫ్లాష్ ఫ్లడ్ వేరు! హెచ్చరికకు సమయం ఇవ్వదు... కొండ ప్రాంతాల్లో... క్లౌడ్ బరస్ట్, హిమనద సరస్సు తెగిపోవడం, భారీ ల్యాండ్‌స్లైడ్, ఐస్-రాక్ అవలాంచ్ లాంటి ఘటనలు జరిగితే... నీరు, మట్టి, రాళ్లు ఒక్కసారిగా దిగువ ప్రాంతాలపై విరుచుకుపడతాయి. అదే ఫ్లాష్ ఫ్లడ్ విధ్వంసం. నేపాల్ లో వచ్చిన విపత్తును సులభంగా అర్థం చేసుకోవాలంటే ఒక ఉదాహరణ చూద్దాం. నీటితో నిండిన బకెట్‌లోకి... ఒక్కసారిగా భారీ రాయిని వేస్తే ఏమవుతుంది? నీరు బయటకు ఎగిసిపడుతుంది. అదే విధంగా... ఎత్తైన పర్వత ప్రాంతంలో భారీ మంచు-రాతి భాగం విరిగి లోయలోకి పడితే... అక్కడ ఉన్న నీరు ఒక్కసారిగా భారీ ప్రవాహంగా మారే అవకాశం ఉంటుంది. కానీ హిమాలయాల్లో ఇది కేవలం నీరు కాదు... దానితో పాటు... మంచు,బండరాళ్లు,చెట్లు,మట్టి, శిథిలాలు ఇలా అన్నీ కలిసి ఒక విధ్వంసకర ప్రవాహంగా మారతాయి. విపత్తుపై శాటిలైట్ చిత్రాలు ఏం చెబుతున్నాయి అంటే....నిజానికి ఇలాంటి విపత్తుల్లో శాటిలైట్ చిత్రాలు అత్యంత కీలకం. ఎందుకంటే... మనిషి చేరలేని వేల అడుగుల ఎత్తులో ఏం జరిగిందో... అంతరిక్షం నుంచి తీసిన చిత్రాలు చెప్పగలవు. ఈ చిత్రాల ద్వారా శాస్త్రవేత్తలు ఏం పరిశీలిస్తారంటే హిమనదాల పరిమాణంలో మార్పు, కొత్తగా ఏర్పడుతున్న సరస్సులు, మంచు కరిగే వేగం, పర్వతాలపై పగుళ్లు, రాక్ ఫాల్ జోన్లు, నదుల ప్రవాహ మార్పులు. తాజా విపత్తు తర్వాత కూడా శాటిలైట్ చిత్రాల ద్వారా కొత్తగా ఏర్పడిన నీటి నిల్వలు, భవిష్యత్తులో మరో వరద ప్రమాదం ఉండే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. అంటే విపత్తు ముగిసిందని అనుకున్నా... ప్రమాదం పూర్తిగా తొలగిపోయిందని చెప్పలేని పరిస్థితి.

### హిమాలయాలు ఎందుకు అస్థిరంగా మారుతున్నాయి ?

ఇదే ఇప్పుడు ప్రపంచాన్ని కలవరపెడుతున్న అతిపెద్ద ప్రశ్న. భూమి ఎందుకు మండిపోతోంది ? దానికి ప్రధాన కారణాల్లో ఒకటి... గ్లోబల్ వార్మింగ్. పారిశ్రామిక విప్లవం తర్వాత... బొగ్గు వినియోగం పెట్రోల్, డీజిల్ వినియోగం భారీ పరిశ్రమలు అడవుల నరికివేత కాలుష్యం అధిక కార్బన్ ఉద్గారాలు....వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులను పెంచాయి. దీంతో భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భూమి వేడెక్కుతోంది... సముద్రాలు వేడెక్కుతున్నాయి... హిమనదాలు కరుగుతున్నాయి... పర్వతాల నిర్మాణం అస్థిరంగా మారుతోంది.

### హిమాలయాల్లో అసలు ప్రమాదం ఏంటి ?

హిమాలయ ప్రాంతంలో ఉష్ణోగ్రత పెరగడం అంటే... కేవలం మంచు కరగడం మాత్రమే కాదు. దాని ప్రభావం చాలా పెద్దది. ఉష్ణోగ్రత పెరిగితే... (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## రిజర్వేషన్లు..

'రిజర్వేషన్ హటావో' నినాదం వినిపించింది. కుల ఆధారిత రిజర్వేషన్లు వద్దని, ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక కావాలని డిమాండ్లు వచ్చాయి. 'ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలి' అన్న మాటకు సహజంగానే ఆకర్షణ ఉంటుంది. పేదరికంలో ఉన్న ప్రతి యువకుడికీ అవకాశం రావాలన్న ఆకాంక్ష కూడా న్యాయమై నదే. కానీ దేశం ఇప్పుడు అడగాల్సిన అసలు ప్రశ్నవేరొకటి. రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం నిజంగానే వచ్చేస్తుందా? లేక సామాజిక అసమానతను కనిపించకుండా చేయడమే జరుగు తుందా? రిజర్వేషనన్ను కేవలం ఉద్యోగంలో ఒకసీటు, విద్యలో ఒక సీటుగా చూడటం దాని అసలు ఉద్దేశాన్నిచిన్న దిగా చేయడమే. భారత రాజ్యాంగం రూపుదిద్దుకున్న సమా జం శతాబ్దాలుగా సమాన అవకాశాలతో నడిచిన సమాజం కాదు. కులం ఆధారంగా వృత్తి, విద్య, సామాజిక గౌరవం, నివాసం, అధికారానికి ప్రవేశం నిర్ణయించబడిన చరిత్రమన ముందు ఉంది. అందుకే రాజ్యాంగ నిర్మాతలు సమానత్వాన్ని ప్రకటించడంతో ఆగలేదు. సమాన అవకాశాలు అందని వర్గాలకు ప్రత్యేక అవకాశాలకుకూడా మార్గం సుగమం చేశారు. ఇక్కడే ఆర్థిక వెనుకబాటుతనం, సామాజిక వెనుకబాటు తనం మధ్య తేడాను గుర్తించాలి. ఒక పేద కుటుంబానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాడు. అది నిజమే. అతనికి విద్య, స్కాలర్షిప్, కోచింగ్, ఉపాధి, ఆర్థిక సహాయం అందాలి. కానీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడితేఆర్థిక సమస్య తగ్గవచ్చు. సామాజిక వివక్ష మాత్రం కేవలం ఆదా యం పెరిగిందని తొలగిపోదు. ఒక వ్యక్తి ఆదాయం పెరిగి నా, అతని సామాజిక గుర్తింపు, కులపరమైన అనుభవం, సంస్థల్లో ప్రాతినిధ్యం వంటి ప్రశ్నలు అలాగే ఉండవచ్చు. అందుకే 'పేదలందరికీ ఒకే రిజర్వేషన్' అనే వాదన వినడా నికి సమానత్వంలా కనిపించినా, అది సామాజిక వెనుకబా టుతనాన్ని పూర్తిగా అంచనా వేయగలదా అన్నది పరిశీలిం చాలి. పేదరికం జేబును ప్రభా వితం చేస్తుంది. సామాజిక వివక్ష మనిషి అవకాశాలను, గౌరవాన్ని, సంబంధాలను ప్రభావితం చేస్తుంది. రెండింటికీ పరిష్కారాలు అవసరం. కానీ రెండింటినీ ఒకే కొలమానంతో కొలవడం సరైన విధానం కాదు. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషనన్ను సమానత్వానికి వ్యతి రేకమైన మినహా యింపుగా మాత్రమే చూడలేదు. 2024లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ఉద్దేశాన్ని విశ్లేషిస్తూ, చారి త్రకంగా కొద్దిమంది సమూహాల ఆధిపత్యంలో ఉన్న పరిపాలనా వ్యవస్థలో వెనుకబడిన వర్గాలకు ప్రాపర్ లుక్ ఇన్ కల్పించడం, వారికి పరి పాలనలో, పాలనలో వాటా కల్పిం చడం రిజర్వేషన్ లక్ష్యమని న్యాయపరమైన చర్చనునమోదు చేసింది. 2026లోనూ సుప్రీంకోర్టు ఆర్టికల్ 14, 15, 16, పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రతికూలతలను తొలగించేందుకు రాష్ట్రం తగిన చర్యలు తీసుకోవచ్చని, రిజర్వేషన్లు సమాన అవకాశాన్ని సాధించే ఒక మార్గమని పేర్కొంది. అంటే రాజ్యాంగ దృష్టిలో రిజర్వే షన్కు మూల ప్రశ్న ఎవరు పేద? అనేది మాత్ర మేకాదు. ఎవరు వెనుక బడ్డారు? ఎవరు తగిన ప్రాతినిధ్యం పొందలేదు? ఎవరు నిర్ణయ వ్యవస్థలోకి ప్రవేశించలేక పోయారు?" అన్నదీ అంతే ముఖ్యమైన ప్రశ్న. ఆరిక్టల్ 342ఎ కూడా సామాజి కంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల రాష్ట్రాలవారీ గుర్తింపుకు రాజ్యాంగపరమైన వ్యవస్థను కొన సాగిస్తోంది. అయితే ఇక్కడ మరో నిజాన్ని కూడా ఒప్పుకోవాలి. ఎసి, ఎస్టీ, బిసి/ఒబిసిలను ఒకే రకమైన సామాజిక సమూహాలు గా చూడటం సరైంది కాదు. ముఖ్యంగా ఒబిసి వర్గంలోనే విద్య, ఉద్యోగం, ఆర్థికస్థితి, రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్ర అంతర్గత తేడాలున్నాయి. కొన్ని వర్గాలుముందుకు వెళ్లాయి. మరికొన్ని అత్యంత వెనుకబడిన స్థితిలోనే ఉన్నాయి. అందు కే ఒబిసి రిజర్వేషన్లే చర్చలో క్రీమీ లేయర్, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రయోజనం, డేటా ఆధారిత సమీక్ష వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ఇదే విషయంలో సుప్రీంకోర్టు కూడా ఒబిసిలలో క్రీమీ లేయర్ను వేరు చేయడం, నిజంగా అవసరమైన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజ నం చేరేలా చూడడం వంటి అంశాలను ప్రస్తావించింది. రిజర్వేషన్ వ్యవస్థలో లోపాలుంటే వాటినిసరిదిద్దాలి. కానీ లోపాలున్నాయని మొత్తం వ్యవస్థనే తొలగించడంపరిష్కారం కాదు. ప్రయోజనాలు నిజంగా అర్హులైన వారికి చేరేలా చేయ డం అసలు పరిష్కారం. ఇక్కడ ప్రతిభ అనేపదాన్నీ ఒకసారి ప్రశ్నించాలి. పరీక్షలో వచ్చిన మార్కులే ప్రతిభకు పూర్తి కొలమానమా? ఒక విద్యార్థికి చిన్నప్పటి నుంచే మంచి పాఠ శాల, ప్రైవేట్ కోచింగ్, పుస్తకాలు, ఇంట ర్నెట్, చదువుకు అనుకూలమైన వాతావరణం లభిస్తేమరొక విద్యార్థి ఉపాధ్యాయుల కొరత, పేదరికం, సామాజిక వెను కబాటుతనం మధ్య చదివితే ఇద్దరినీ ఒకే ప్రారంభ రేఖ వద్దనిలబెట్టినట్టు ఎలా భావించగలం? పోటీకి ముందు సమాన అవకాశాలు ఉన్నాయా అన్న ప్రశ్న లేకుండా, పోటీ ఫలితాన్ని మాత్రమే మెరిట్గా పిలవడం అసంపూర్ణమైన విశ్లేషణ. ఇదేసమయం లో రిజర్వేషన్కు వ్యతిరేకంగా ఉన్న వారి ప్రశ్నలను కొట్టి పారేయడం కూడా సరైంది కాదు. రిజర్వేషన్ ఎంతకాలం? ప్రయోజనం ఎవరికి చేరుతోంది? నిజంగా వెనుకబడినవారికి అందుతోందా? ఒకే కుటుంబాలు తరతరాలుగా ప్రయో జనం పొందుతున్నాయా? క్రీమీలేయర్ పరిమితులు సమ ర్థంగా అమలవుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలి. సామాజిక న్యాయం పేరుతో వ్యవస్థలోని లోపా లను దాచడంకూడా సామాజిక న్యాయంకాదు. కానీ ఆ ప్రశ్నలకు సమాధానం రిజర్వేషన్ రద్దు అని చెప్పడం మాత్రం తార్కికంగా సరిపోదు.

## హైదరాబాద్ రాయదుర్గంలో మరోసారి భూముల రికార్డు ధర.. ఎకరం రూ.269 కోట్లు!



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ ఐటీ కారిడార్లో భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. రాయదుర్గంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. హైదరాబాద్ ఐటీ హబ్, గచ్చిబౌలి, నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ గిరాకీని ఆదాయంగా మార్చుకునే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలానికి రియల్ ఎస్టేట్ రంగం నుంచి భారీ స్థాయిలో స్పందన లభిస్తోంది.

## "విశాఖ నృత్యోత్సవ్ 2026" లోగో-పోస్టర్లను ఆవిష్కరించిన ఒడిశా గౌరవ గవర్నర్ కంభంపాటి హరిబాబు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరానికి చెందిన ప్రఖ్యాత నటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ తమ "18వ ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ --నిర్వహణకు తొలి అడుగే సింది. అందుకు సంబంధించిన "విశాఖ నృత్యోత్సవ్ 2026" అధికారిక లోగో మరియు డాన్స్ ఫెస్టివల్ పోస్టర్లను ఒడిశా గౌరవ గవర్నర్ కంభంపాటి హరి బాబు ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి. రమణమూర్తి, ఫెస్టివల్ డైరెక్టర్ విక్రమ్ గౌడ్, ఫెస్టివల్ కోఆర్డినేటర్ భాగ్యశ్రీ బత్తిన పాల్గొని గవర్నర్ కలిసి అధికారిక ప్రచార పత్రాలను విడుదల చేశారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు సాయంత్రం 6:00 గంటల నుండి స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. భారతదేశం నలుమూలల నుండి వచ్చే ప్రముఖ నృత్య కళాకారులు, కళా బృందాలు ఈ వేదికపై వివిధ శాస్త్రీయ, జానపద నృత్య రీతులను ప్రదర్శించనున్నారు. మొదటి రోజు సెప్టెంబర్ 26న గీతా నారాయణ్ సడగాణి (ఆంధ్రప్రదేశ్) చే కూచిపూడి, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనా జవేరి గ్రూప్ (మహారాష్ట్ర) మణిపురి, హరి రెడ్డి గ్రూప్ (కర్ణాటక) చే కథక్ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే రెండో రోజు సెప్టెంబర్ 27న కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వసుంధర దొరస్వామి బృందం (కర్ణాటక)భరతనాట్యం, మరియు అఫ్సాన్ గుజరాత్ బృందం (రాజస్థాన్) చే చారీ జానపద నృత్య ప్రదర్శనలు జరగనున్నాయన్నారు. గత 17 సంవత్సరాల నుంచి భారతీయ సంప్రదాయ నృత్య కళల్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ విశాఖ నృత్యోత్సవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది 18 వ నృత్యోత్సవమని, అందరు తరలి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వానిది: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. "ఏ వైద్య పరీక్ష అయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది" అని సీఎం తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా డీఎస్సీ నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారదర్శకంగా 16 వేలమందికి టీచర్ పోస్టులిస్తే ఏడాది తర్వాత గొడ్డలి పార్టీ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడి, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా, ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా శెభాష్ అన్న ముఖ్యమంత్రి. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు? ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. ఆర్.కె.(రామకృష్ణ) నగర్ లో మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. వారందరీ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు.

(మొదటిపేజీ తరువాయి)

## నేపాల్ జలప్రళయం.. ప్రపంచానికి ప్రకృతి ఇచ్చిన వార్నింగ్ !



హిమనదాలు కరుగుతాయి. కొత్త గ్లేషియర్ సరస్సులు ఏర్పడతాయి. మంచు కింద ఉన్న నేల బలహీనపడుతుంది. పర్వత రాళ్ల మధ్య ఉన్న మంచు కరుగుతుంది. కొండచరియలు అస్థిరంగా మారతాయి. భారీ ల్యాండ్‌స్లైడ్లకు అవకాశం పెరుగుతుంది. అంటే...భూమి వేడెక్కడం వల్ల పర్వతాలు కూడా బలహీనపడుతున్నాయి.

### ఇది కేవలం ప్రకృతి వైపరీత్యమా ?

మన చిన్నప్పటి నుంచి ఒక మాట వింటూ వచ్చాం... ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు వస్తాయో చెప్పలేం! అది నిజమే. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు మరో విషయం చెబుతున్నారు. ప్రతి విపత్తుకు...కేవలం ప్రకృతిని మాత్రమే నిందించలేం. ఎందుకంటే...మనిషి చర్యలు కూడా ప్రకృతి ప్రమాదాలను మరింత తీవ్రంగా మార్చుతున్నాయి. ఉదాహరణకు... విచక్షణారహిత అడవుల నరికివేత కొండలను పేల్చి రోడ్ల నిర్మాణం సున్నితమైన ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలు శాస్త్రీయ అధ్యయనం లేకుండా పవర్ ప్రాజెక్టులు పర్యాటక ఒత్తిడి అధిక కార్బన్ ఉద్గారాలు ఇవన్నీ కలిసి ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి.

### పాలకులు నేర్చుకోవాల్సిన పాఠం ఏంటి?

నేపాల్ విపత్తు ప్రభుత్వాలకు ఒక పెద్ద ప్రశ్న వేస్తోంది. అభివృద్ధి కావాలా ? ప్రకృతి పరిరక్షణ కావాలా? అసలు ప్రశ్న అది కాదు. ప్రకృతిని కాపాడుకుంటూనే అభివృద్ధి ఎలా చేయాలి ? అదే అసలు సవాల్. కొండ ప్రాంతాల్లో... ఎక్కడ నిర్మాణాలు చేయాలి ? ఎక్కడ చేయకూడదు ? ఎన్ని హైడ్రో ప్రాజెక్టులు అవసరం ? ఏ ప్రాంతాలు ప్రమాదకరమైనవి ? ఎంత జనాభాను అనుమతించాలి ? అనే అంశాలపై శాస్త్రీయ ప్రణాళిక అవసరం. నేపాల్ లో వరద విపత్తు నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలి అనేదానిపై ఆసక్తి నెలకొనింది.

### నేపాల్ విపత్తు తర్వాత ప్రపంచం తీసుకోవాల్సిన ప్రధాన నిర్ణయాలు ఇవే...

1. గ్లేషియర్ మానిటరింగ్ అంటే హిమనదాలను నిరంతరం శాటిలైట్ల ద్వారా పరిశీలించాలి. 2. గ్లేషియర్ సరస్సుల మ్యాపింగ్ అంటే ప్రమాదకర సరస్సులను గుర్తించాలి. 3. ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ అంటే కొండ ప్రాంతాల నుంచి దిగువ గ్రామాలకు క్షణాల్లో హెచ్చరికలు వెళ్లాలి. 4. ప్రమాదకర ప్రాంతాల్లో నిర్మాణాల నియంత్రణ అంటే నదీ పరివాహక ప్రాంతాల్లో విచ్చలవిడిగా నిర్మాణాలు నిలిపివేయాలి. 5. అంతర్జాతీయ సమాచారం పంచుకోవడం...అంటే హిమాలయాలు అనేక దేశాలకు సంబంధించినవి. ఒక దేశంలో జరిగిన మార్పు... మరో దేశంపై ప్రభావం చూపుతుంది. కాబట్టి... భారత్, నేపాల్, చైనా, భూటాన్,పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల మధ్య పర్యావరణ సమాచార మార్పిడి అత్యవసరం. భారత్ నేర్చుకోవాల్సిన అతిపెద్ద పాఠం ఏంటంటే.... నేపాల్ మనకు దూరంగా లేదు. హిమాలయాలే భారత్‌కు ఉత్తర రక్షణ కవచం. కానీ...అదే హిమాలయాల్లో అస్థిరత పెరిగితే... దాని ప్రభావం భారతదేశంపైనా ఉంటుంది. మన దేశంలో కూడా... ఉత్తరాఖండ్ హిమాచల్ ప్రదేశ్ సిక్కిం అరుణాచల్ ప్రదేశ్ జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాలు ప్రకృతి వైపరీత్యాలకు అత్యంత సున్నితమైనవి. గతంలో...ఉత్తరాఖండ్ విపత్తు... సిక్కిం గ్లేషియర్ సరస్సు వరద... హిమాచల్‌లో కొండచరియలు... అస్సాంలో భారీ వరదలు... మనకు ఇప్పటికే చాలా హెచ్చరికలు ఇచ్చాయి. ఇప్పుడు నేపాల్ మరో అలారం మోగించింది. అస్సాం నుంచి నేపాల్ వరకు... ఒకే హెచ్చరిక ! మొన్న అస్సాం... నిన్న హిమాలయ ప్రాంతాలు... ఈ రోజు నేపాల్... ప్రపంచవ్యాప్తంగా... రికార్డు ఉష్ణోగ్రతలు,భారీ వర్షాలు,ఆకస్మిక వరదలు,అడవి మంటలు, మంచు కరుగుదల పెరుగుతున్నాయి. ఇవి వేర్వేరు ఘటనలు కావచ్చు... కానీ వాటి వెనుక ఉన్న పెద్ద ప్రశ్న ఒక్కటే. భూమి వాతావరణ వ్యవస్థ మారుతోందా? శాస్త్రవేత్తల హెచ్చరిక కూడా ఇదే. వాతావరణ మార్పు కారణంగా తీవ్ర వాతావరణ ఘటనలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. నేపాల్‌లో జరిగింది "ఇన్‌ల్యాండ్ సునామీ" లాంటి విధ్వంసం అనుకోవచ్చు. సునామీ అంటే మనకు గుర్తుకు వచ్చేది సముద్రం. కానీ కొండ ప్రాంతాల్లో కూడా... అత్యంత భారీ స్థాయిలో నీరు, మట్టి, రాళు ఒక్కసారిగా లోయల్లోకి దూసుకెళ్తే... దాని విధ్వంసం సునామీని తలపిస్తుంది. నదులు తమ సహజ ప్రవాహాన్ని కోల్పోతాయి. నీటి వేగం పెరుగుతుంది. భారీ బండరాళ్లు కూడా బొమ్మల్లా కొట్టుకుపోతాయి. ఇళ్లకు పునాదులు ఉండవు. బ్రిడ్జిలు క్షణాల్లో కూలిపోతాయి. మనిషికి స్పందించడానికి కూడా సమయం ఉండదు. అందుకే ఫ్లాష్ ఫ్లడ్ అత్యంత ప్రమాదకరమైన ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటి. కైలాస్ మానసరోవర్ యాత్రికులపై విపత్తు ప్రభావం పడింది. నేపాల్‌లోని రసువా ప్రాంతం... కైలాస్ మానసరోవర్ యాత్రకు వెళ్లే అనేక పర్యాటకులు, యాత్రికులు ఉపయోగించే కీలక మార్గాల్లో ఒకటి. ఈ మార్గంలో...భారతీయ యాత్రికులు,విదేశీ పర్యాటకులు,ట్రెక్కర్లు ఉండటంతో విపత్తు ప్రభావం అంతర్జాతీయ స్థాయికి చేరింది. చాలా మంది యాత్రికుల ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. భారత్, నేపాల్‌తో పాటు ఇతర దేశాల అధికారులు కూడా తమ పౌరుల వివరాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. నేపాల్ దుర్ఘటన జరిగిన తర్వాత ప్రకృతి ముందు మనిషి చాలా చిన్నవాడు అని అనిపిస్తుంది. అత్యాధునిక టెక్నాలజీ ఉంది... శాటిలైట్లు ఉన్నాయి... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉంది... అత్యాధునిక కమ్యూనికేషన్ ఉంది... కానీ...వేల అడుగుల ఎత్తులో ఒక పర్వతం విరిగిపడి... కోట్ల టన్నుల మంచు, రాళ్లు లోయల్లోకి దూసుకొస్తే... మనిషి ఎంత నిస్సహాయుడో నేపాల్ చూపించింది. సీసీ కెమెరాల్లో కనిపించిన ప్రజల పరుగులు... కొట్టుకుపోతున్న వాహనాలు... కూలిపోతున్న బ్రిడ్జిలు... బురదలో కూరుకుపోయిన గ్రామాలు... ఇవి కేవలం విజువల్స్ కాదు... భవిష్యత్తుకు ప్రకృతి పంపిన హెచ్చరికలు. విపత్తులకు కారణమవుతున్న వాటిలో ఒకటి గ్లోబల్ వార్మింగ్....అంటే భూమి వేడెక్కడం. ఇంతుకు భూమిని మండిస్తున్నది ఎవరు? భూమి ఎందుకు మండిపోతోంది ? ఎవరి వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి? ఎవరి అభివృద్ధి కోసం అడవులు నరికేస్తున్నాం? ఎవరి లాభాల కోసం కొండలను పేల్చేస్తున్నాం? ఎవరి వ్యాపారాల కోసం నదులను మార్చేస్తున్నాం? ఎవరి సౌకర్యాల కోసం ప్రకృతి సమతుల్యతను పణంగా పెడుతున్నాం ?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది... కేవలం ప్రభుత్వాలు కాదు... కేవలం పారిశ్రామికవేత్తలు కాదు... మనం అందరం! ఎందుకంటే... కాలుష్యానికి సరిహద్దులు లేవు... గ్లోబల్ వార్మింగ్‌కు దేశాల మధ్య గీతలు లేవు... హిమాలయాల్లో మంచు కరిగితే... దాని ప్రభావం ఒక్క దేశానికే పరిమితం కాదు. నేపాల్‌లో జరిగినది కేవలం ఒక దేశానికి చెందిన విషాదం కాదు... అది ప్రపంచానికి వచ్చిన వార్నింగ్. మొన్న అస్సాం చూసాం... గతంలో ఉత్తరాఖండ్ చూసాం... సిక్కిం చూసాం... హిమాచల్ చూసాం... ఇప్పుడు నేపాల్ చూస్తున్నాం... ప్రతి విపత్తు తర్వాత... ఇలాంటి ఘటన మళ్లీ జరగకూడదు" అంటాం. కానీ... జరగకముందే నేర్చుకుంటున్నామా? అదే అసలు ప్రశ్న ! ప్రకృతిని జయించడానికి ప్రయత్నిస్తే... ప్రకృతి ఒక్కరోజు తన శక్తిని చూపిస్తుంది! ప్రకృతితో కలిసి జీవిస్తేనే... రాబోయే తరాలకు భద్రమైన భూమిని అందించగలం! నేపాల్ జలప్రళయం మనకు చెప్పేది ఒక్కటే... "ఇప్పటికైనా మేలుకోండి..." "భూమిని కాపాడండి..." "లేకపోతే రేపటి విపత్తు మన గుమ్మం దగ్గరే ఉండొచ్చు...!

# పక్కదారి పడుతున్న 45 గ్యాస్ సిలిండర్లను పట్టుకున్న లబ్ధిదారులు..



**పెదబయలు, పతాకం న్యూస్:** స్థానిక జీసీసీ గోడౌన్‌కు గ్యాస్ సిలిండర్ల లోడ్ వచ్చింది. దీంతో లబ్ధిదారులు ఉదయం ఆరు గంటల నుంచి క్యూలో నిలబడి ఉన్నారు. అర్హులైన లబ్ధిదారులను పక్కన పెట్టి గోడౌన్ సిబ్బంది లోడుతో వచ్చిన వాహనం నుంచి 45 గ్యాస్ సిలిండర్లను ప్రైవేటు బొలెరో వాహనంలోకి తరలించేదుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని అక్కడే గ్యాస్ కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్న లబ్ధిదారులు, మాజీవార్డు సభ్యుడు గందేరు జీవన్ కుమార్ అడ్డుకున్నారు. సిలిండర్ల తరలింపునకు అవసరమైన పత్రాలను చూపించమని నిలదీశారు. వారి వద్ద పత్రాలు లేకపోవడంతో స్థానిక డిప్యూటీ తహశీల్దార్ జి. రంగారావుకు ఫిర్యాదు చేశారు. డీటీ ఆదేశాల మేరకు ఆర్ఐ పూర్ణయ్య, వీఆర్వో మౌనిక గోడౌన్ వద్దకు చేరుకుని పక్కదారి పట్టిస్తున్న 45 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. వాటిని గోడౌన్‌లో భద్రపరిచారు. అలాగే సిలిండర్ల తరలింపునకు ఉపయోగించిన బొలెరో వ్యాన్‌ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై 6ఏ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్యాస్ కోసం సామాన్య లబ్ధిదారులు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడుతుంటే కొంతమంది వ్యక్తులకు పెద్ద సంఖ్యల్లో సిలిండర్లు ఎలా తరలిస్తున్నారని స్థానికులు ప్రశ్నించారు. లబ్ధిదారునికి ఓటీపీ లేకుండా ఒక్క సిలిండర్ కూడా ఇవ్వని జీసీసీ గోడౌన్ సిబ్బంది పదుల సంఖ్యల్లో సిలిండర్లు ఎలా తరలిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ గోడౌన్ సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులు కుమ్మక్కై ఈ దందాకు పాల్పడుతున్నట్టు అధికారుల వద్ద లబ్ధిదారులు ఆరోపించారు. జీసీసీ గోడౌన్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల రెండో తేదీన పాయకరావుపేట పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. నక్కపల్లి మండలంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు దశాబ్దాల కల అని, ఇన్నాళ్లకు ఆ కలను సీఎం చంద్రబాబునాయుడు సాకారం చేస్తున్నారని అన్నారు. వచ్చే బుధవారం పోలవరం ఎడమ కాలువకు పాయకరావుపేట వద్ద నిర్వహించే జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతున్నారని, అందువల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, సీఎం పర్యటనకు వేలాది మంది రైతులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి అసౌర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, కార్పొరేషన్ల చైర్మన్లు ప్రగడ నాగేశ్వరరావు, గండి బాబ్జీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 300 కుటుంబాలను రోడ్డున పడేసే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారు?: బీవీ రామ్




- **300 ఎయిర్ పోర్టు కార్మికులతోనే మాట్లాడలేని నారా లోకేష్ ... భవిష్యత్తులో ముఖ్యమంత్రి అయితే ఎలా పరిపాలిస్తాడు**
- **కార్మికులతో చర్చలు జరిపి న్యాయం జరిగేలా తక్షణమే సెటిల్‌మెంట్ చేయాలని ప్రభుత్వాని తెలుగు శక్తి డిమాండ్**

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ విమానాశ్రయ కార్మికులకు తక్షణ న్యాయం చేయాలి తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ పేర్కొన్నారు. 300 ఎయిర్ పోర్టు కార్మికులతోనే మాట్లాడలేని నారా లోకేష్ ... భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతే ఎలా పరిపాలిస్తాడు అని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ను ప్రశ్నించారు. శనివారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం విమానాశ్రయ కార్మికుల సమస్యపై ప్రజాస్వామ్య పద్ధతిలో మా పోరాటం కొనసాగుతోందని, ఈ రోజుతో మా ఆందోళన 13వ రోజుకి చేరుకుందన్నారు. విశాఖ విమానాశ్రయంలో దాదాపు 25 - 20 సంవత్సరాలుగా పని చేస్తూ వచ్చిన కార్మికులకు న్యాయం చేయాలి. వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా పూర్తి స్థాయి సెటిల్‌మెంట్ చేయాలి. ఈ రోజు చాలామంది అనేక రకాలుగా మాట్లాడుతున్నారు. కానీ అసలు సమస్య ఏమిటంటే, 300 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రావడం ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు సిగ్గుచేటు. ఇన్ని సంవత్సరాలు విమానాశ్రయానికి సేవలందించిన కార్మికులను ఒక్కసారిగా నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ 300 కుటుంబాల పరిస్థితిని వెంటనే పరిగణనలోకి తీసుకుని, వారికి తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈరోజు కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పరిస్థితి మరింత విషమిస్తే, దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. అయితే ఈ సమస్యను పరిష్కరించకుండా 300 కుటుంబాలను రోడ్డున పడేస్తే మాత్రం ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా ప్రశ్నించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందుకే ప్రభుత్వం వెంటనే స్పందించి, కార్మికులతో చర్చలు జరిపి, కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగేలా తక్షణమే సెటిల్‌మెంట్ చేయాలని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మా డిమాండ్‌ను సానుకూలంగా పరిగణించి, కార్మికుల కుటుంబాల్లో ఆందోళన తొలగించే విధంగా వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## 'సర్'పై ప్రత్యేక క్యాంపులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. సందేహాలు నివృత్తి చేయడంతో పాటు ఓటర్ల జాబితాలో నమోదుకు దరఖాస్తులను స్వీకరిస్తారు. కాగా జిల్లాలో 2,29,924 మంది ఓటర్లు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు సరిగా లేవని అధికారులు గుర్తించారు. వారందరికీ బీఎల్‌వోలు నోటీసులు జారీచేశారు. నోటీసులు అందుకున్న వారిలో 62,465 మంది వివరాలను సరిచేసి తిరిగి సమర్పించారు. మిగిలిన వారు కూడా వచ్చే నెల 28వ తేదీలోగా సమర్పించాల్సి ఉంది.

## విశాఖలో దారుణం.. ఇద్దరు చిన్నారులతో కలిసి దంపతుల ఆత్మహత్య



**పెందుర్తి పతాకం న్యూస్:** విశాఖ జిల్లా పెందుర్తిలో దారుణం జరిగింది. ఇద్దరు చిన్నారులకు విషమిచ్చి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెందుర్తి పరిధిలోని చింతల అగ్రహారంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కొత్తవలసకు చెందిన మల్ల ప్రవీణ్ కుమార్ కొంతకాలంగా జీవనోపాధి కోసం పెందుర్తిలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ప్రవీణ్ ఆటో డ్రైవర్‌గా, అతని భార్య కాయగూరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు రెండేళ్లు, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శ కుటుంబ సభ్యులతో రాఖీలు కట్టించుకున్న ప్రవీణ్ కుమార్.. రాత్రి సమయంలో సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు 'RIP' అంటూ సందేశం పంపినట్లు సమాచారం. ఆ తర్వాత ప్రవీణ్ కుమార్ అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తినిపించి తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తల్లి, ఇద్దరు బిడ్డలను వెంటనే ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన అనంతరం చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. ఆర్థిక ఇబ్బందులు కారణమా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

## గిడుగు రామ్మూర్తి పురస్కారానికి తెలుగు ఉపాధ్యాయుడు ఎంపిక

**తుమ్మపాల, పతాకం న్యూస్:** అనకాపల్లి మండలం కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కోరాడ అప్పలరాజు, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తెలుగు, సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో అప్పలరాజు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలుగు భాష, సాహిత్య, సామాజిక రంగాల్లో విశేష సేవలందించినందుకు అప్పలరాజును గిడుగు రామ్మూర్తి పురస్కారానికి ఎంపికచేసినట్టు ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు భాష ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు.

## పాఠశాలల నిర్వహణకు నిధులు విడుదల

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను జిల్లాలో గల 582 ప్రభుత్వ పాఠశాలకు పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ, ఇతర ఖర్చుల నిమిత్తం సమగ్ర శిక్ష అభియాన్ ఉన్నతాధికారులు రూ.86.7 లక్షలు మంజూరుచేశారు. ఏడాదికి రూ.173.4 లక్షలు కేటాయించినా అందులో సగం మాత్రమే విడుదల చేశారు. 30 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు ఏడాదికి రూ.10 వేలు, 30 నుంచి 100 మంది ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 వరకు రూ.50 వేలు, 250 నుంచి 1000 మంది ఉంటే రూ.75 వేలు, వెయ్యి మంది దాటితే రూ.లక్ష ఇవ్వాలి. అయితే ఇందులో ప్రస్తుతం సగం గ్రాంటు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2024 నుంచి స్కూలు గ్రాంటు విడుదల చేస్తున్నారు. అయితే సగమే ఇస్తున్నారు. మిగిలిన మొత్తం కూడా విడుదల చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

## అధ్వానంగా రహదారుల నిర్వహణ

**ఆర్‌అండ్‌బీ రోడ్లపై మొక్కుబడిగా గోతులు పూడ్చివేత**



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రహదారుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. రోడ్లపై ఏర్పడిన గుంతలను పక్కాగా పూడ్చకుండా.. కంటి తుడుపుగా ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షానికే రాళ్లు లేచిపోయి మళ్లీ గోతులు ఏర్పడుతున్నాయి.రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నచోట కూడా అతుకులు అద్ది చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, మార్టూరు, బొజ్జన్నకొండ రహదారులపై గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు హడావిడిగా పూడ్చివేశారు. తుమ్మపాల మెయిన్ రోడ్డుపైన, మార్టురు జంక్షన్‌లో భారీ గోతులు ఏర్పడినచోట తారు మిక్సింగ్ ప్లాంట్ వద్ద నుంచి వ్యర్థాన్ని తీసుకొచ్చి పూడ్చేశారు. కె.కోటపాడు రహదారిపై గుంతలకు ఇటీవల ప్యాచ్‌వర్కులు చేపట్టారు. లంకెలపాలెం నుంచి అసకపల్లి వరకు రోడ్డు పనులను కాంట్రాక్టరు చేపట్టకపోవడంతో గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. ఇవి తాత్కాలిక ఉపశమనాలేనని, కొద్దిపాటి వర్షానికే రాళ్లు లేచిపోయి గుంతలు బయటపడతాయని వాహనదారులు అంటున్నారు. పశ్చిమాసియాలో జరిగిన యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడం, గల్ఫ్ దేశాల్లోని ఆయిల్ రిఫైనరీల నుంచి తారు దిగుమతి తగ్గిపోవడంతో తారు ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో టన్ను తారు రూ.45 వేలు వుంది. రహదారుల అభివృద్ధి పనుల కోసం అప్పటి ధరలకు అనుగుణంగా ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు అంతకన్నా ఒకింత తక్కువకు బిడ్లు దాఖలు చేశారు. టెండర్లను ఖరారు చేసి, పనులు ప్రారంభించే సమయానికి పశ్చిమాసియాలో భీకరంగా యుద్ధం జరుగుతున్నది. దీంతో తారు దిగుమతులు నిలిచిపోవడంతోపాటు తారు ధర ఏకంగా టన్ను రూ.90 వేలకు చేరింది. ఈ రేటుకు తారు కొనుగోలు చేసి రోడ్ల పనులు చేస్తే.. తాము అప్పుల పాలు కావాల్సిందేనంటూ కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. పశ్చిమాసియాలో యుద్ధం మొదలుకావడానికి చాలా ముందుగా రోడ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు సైతం... తరువాత తారు ధరలు పెరగడంతో పనులు ఆపేయడం లేదా చాలా నెమ్మదిగా కొనసాగించడం చేస్తున్నారు. గతంలో టెండర్లు పిలిచి ఖరారు చేసిన అచ్యుతాపురం-గాజువాక రోడ్డు పనులను కాంట్రాక్టర్ మొదలుపెట్టలేదు. భీమిలి- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద రహదారి మొత్తం ఛిద్రమైంది. అదే విధంగా చోడవరం పట్టణ పరిధిలో కూడా రోడ్డు దారుణంగా వుంది. రావికమతం- తట్టబంద రోడ్డులో దాసరిపాలెం వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రోలుగుంటలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి కన్నూరుపాలెం మీదుగా నర్సీపట్నం వెళ్లే రోడుపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వీటిని పూడ్చినప్పటికీ కొద్దిపాటి వర్షానికే కొట్టుకుపోయాయి.

## విద్యుత్ సరఫరాలో నాణ్యతే లక్ష్యం: సీఎండీ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి సుమారు రూ.1,800 కోట్లతో పనులు చేపడుతున్నామని, వాటిపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. కార్పొరేట్ కార్యాలయంలో ఉన్నత స్థాయి అధికారులకు రెండు రోజుల వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో కొద్ది నిమిషాల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా వినియోగదారులు తీవ్రంగా స్పందిస్తున్నారన్నారు. ఎక్కడైనా నిర్వహణ పనులు, లైన్ క్లియర్లు, అంతరాయాలు ఉంటే ముందుగానే దానిపై ఆ ప్రాంత వినియోగదారులకు తెలియజేయాలని, సోషల్ మీడియాను దీనికి ఉపయోగించుకోవాలన్నారు. అదే విధంగా పెరుగుతున్న అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, అదనపు ట్రాన్సఫార్మర్ల ఏర్పాటు, భూగర్భ విద్యుత్ కేబుల్ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో డిజిటల్ విధానాలు మరింత ముందుకు తీసుకువెళ్లాలని, ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న 25 శాతం చెల్లింపులను సున్నాకు తీసుకురావాలన్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలని, వర్చువల్ నెట్ మీటరింగ్ విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద కేంద్రం రాయితీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.20 వేల అదనపు రాయితీ ప్రయోజనాలు వెనుకడిన వర్గాలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ డైరెక్టర్ సూర్యప్రకాశ్, ప్రాజెక్టులు, హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ వనజ, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.హరిబాబు, సీజీఎంలు, 11 సర్కిళ్లకు చెందిన సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఈఈలు, పాల్గొన్నారు.

## సింహాచల దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

**సింహాచలం, పతాకం న్యూస్:** వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నయనార్ అనే ఉద్యోగి విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడడంతో సస్పండ్ చేసినట్టు కార్యనిర్వాహణాధికారి జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. ఆయన అందజేసిన సమాచారం ప్రకారం...అతి శీఘ్రదర్శనం (రూ.300) టికెట్ల విక్రయ కేంద్రంలో నయనార్ విధులు నిర్వహిస్తున్నారు. కొందరు భక్తులకు టికెట్లు జారీ చేయకుండా సొమ్మును స్వాహా చేశారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఆలయ ధ్వజ స్తంభం వద్ద రూ.300 టికెట్లను సిబ్బంది తనిఖీ చేస్తారు. ం కొందరు భక్తులు తాము కౌంటర్‌లో డబ్బులిచ్చి వచ్చామని, టికెట్లు ఏమీ ఇవ్వలేదంటూ సమాధానం చెప్పడంతో అక్కడ విధి నిర్వహణలో ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆలయ ఏఈఓకు ఫిర్యాదు చేశారు. ఏఈఓ ఈ విషయాన్ని ఈఓకు సమాచారం ఇచ్చి కౌంటర్‌కు వెళ్లి విచారణ జరిపారు. అక్కడి సీసీ కెమెరాల పరిశీలించడంతో పాటు సొమ్మును లెక్కించడంతో అవకతవకలకు పాల్పడినట్టు తేలింది. ఈ నేపథ్యంలో విధుల నుంచి నయనార్‌ను సస్పెండ్ చేసి విచారణను కొనసాగిస్తున్నట్టు ఈఓ తెలిపారు.

# కాలుష్యంపై కొరడా.. పరిశ్రమల యాజమాన్యాలకు పీసీబీ స్పష్టీకరణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో కాలుష్య నియంత్రణ విషయంలో రాజీపడేది లేదని పరిశ్రమలు, వాటి పరిధిలో ఉండే వ్యాపార సంస్థలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి స్పష్టంచేసింది. పరిమితికి మించి కాలుష్యం విడుదల చేస్తూ గాలి నాణ్యత క్షీణించడానికి కారణమైన పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు గత ఏడాది విధించిన జరిమానా చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పరిశ్రమలు, వాటికి అనుబంధంగా కార్యకలాపాలు నిర్వహించే సంస్థల ప్రతినిధులతో రెండు రోజుల క్రితం విజయవాడలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. నగరంలో 2025 డిసెంబరు నుంచి 2026 జనవరి వరకు గాలిలో నాణ్యతను బట్టి తనిఖీలు చేసి పలు పరిశ్రమలకు జరిమానా విధించడం జరిగిందని, వాటిని చెల్లించాలని ఆదేశించారు. గాలి నాణ్యత పెంపు కోసం బహిరంగ ప్రదేశాల్లో బొగ్గు, ఇనుము నిల్వలపై పూర్తిగా టార్పాలిన్లు కప్పడం, కార్గో హ్యాండ్లింగ్‌లో యాంత్రీకరణ, చెట్ల పెంపకం వంటివి చేపట్టాలని సూచించారు. విశాఖ పోర్టు, ఎన్టీపీసీ, హిందూజా, ఉక్కు కర్మాగారం, రాంకీ ఫార్మా సిటీలో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి మూడు నుంచి ఆరు నెలల కాలానికి ప్రణాళిక రూపొందించామని, పీసీబీ ఆదేశాల మేరకు వాటిని అమలు చేస్తామని పలు పరిశ్రమలు ప్రతినిధులు వెల్లడించారు. విశాఖ పోర్టు పరిధిలో ఆపరేటింగ్ సంస్థలు నిబంధనలు పాటించాలని పీసీబీ స్పష్టంచేసింది. జిప్సం నిల్వలో తగిన ప్రమాణాలు పాటించాలని కోరమాండల్ ఎరువుల కర్మాగారం యాజమాన్యాన్ని ఆదేశించింది. అదేవిధంగా బొగ్గు, బూడిద రవాణాలో ఎటువంటి లీకేజీలు లేకుండా చూడాలని, గాలికి ధూళి లేవకుండా రోడ్లపై నీరు స్ప్రే చేయాలని హిందూజా, ఎన్టీపీసీ సంస్థలకు స్పష్టంచేసింది. కోక్ ఓవెన్ బ్యాటరీ, ఇతర యూనిట్ల నుంచి వస్తున్న కాలుష్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఉక్కు కర్మాగారం యాజమాన్యానికి సూచించింది. పరిసర ప్రాంతాలకు దుర్గంధం వ్యాపించకుండా చూడాలని, మురుగునీరు సమీపంలోని చెరువుల్లో వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పరవాడ రాంకీ ఫార్మా సిటీ ప్రతినిధులను ఆదేశించింది. ప్రతి పరిశ్రమలో 33 శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని సూచించారు. విశాఖ నగరంలో 2025 డిసెంబరులో గాలి నాణ్యత క్షీణతను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది శీతాకాలంలో కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని ఈ సందర్భంగా చైర్మన్ ఆదేశించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరి రక్షణ దృష్ట్యా బోర్డు ఆదేశాలు పాటించని పరిశ్రమలు మూసివేస్తామని స్పష్టంచేశారు.

# మంగ్లీని కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరు?: అడ్వకేట్ సుబ్బు




**హైదరాబాద్, పతాకం న్యూస్:** మైక్రో ఫైనాన్స్ కేసు వివాదంలో ప్రముఖ గాయని మంగ్లీ చుట్టూ ముసురుకున్న ఆరోపణల వ్యవహారం మరింత తీవ్రరూపం దాలుస్తోంది. మంగ్లీతో తాను రాజీ పడినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను న్యాయవాది సుబ్బు ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేస్తూ... కేసు ఉపసంహరణ కోసం మంగ్లీ మనుషుల నుంచి రూ. కోట్లలో ఆఫర్ వచ్చిందని, కానీ తాను దానిని తిరస్కరించిన విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు. కోర్టుల్లో మంగ్లీపై తాను వేసిన పిటిషన్లతో పాటు, తనపై మంగ్లీ చేసిన నిరాధారమైన ఫిర్యాదుల కేసులు ఇప్పటికీ విచారణలోనే ఉన్నాయని సుబ్బు స్పష్టం చేశారు. తీవ్రమైన అక్రమ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అమెరికాలోని ఎన్నారై తెలుగు నిర్వాహకులు అంతర్జాతీయ వేదికలపై ఎలా అవకాశాలు ఇస్తారని ప్రశ్నించారు. కేసులో నిజానిజాలు తేలేవరకు ఆమెకు విదేశీ షోలలో అవకాశాలు ఇవ్వకూడదని, ఈ విషయమై ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల పక్షాన నిలబడ్డ తమను ఊరు దాటవద్దని పోలీసులు ఆంక్షలు విధిస్తుంటే, నిందితురాలిగా ఉన్న మంగ్లీ స్వేచ్ఛగా విదేశాలకు ఎలా వెళ్తోందని నిలదీశారు. ఆమె అరెస్ట్ కాకుండా వెనుకుండి కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరో ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, ఈ కేసులో కీలక సాక్షి అయిన డ్రైవర్ ఏమయ్యాడు? అతడిని మంగ్లీతో లాలూచీ చేయించింది ఎవరు? అని సంచలన ప్రశ్నలు గుప్పించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేదే లేదని స్పష్టం చేశారు.

# బొప్పరాజు తీరు అనుమానం కలిగిస్తోంది: అనగాని

(మొదటిపేజీ తరువాయి)

బొప్పరాజు అతిపోకడలు ఉన్నాయని మంత్రి మండిపడ్డారు. శనివారం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ, "ఉద్యోగుల సమస్యల అజెండాగా బొప్పరాజు పనిచేస్తున్నారా? లేక పొలిటికల్ అజెండాతో పనిచేస్తున్నారా?" అని సూటిగా ప్రశ్నించారు. చర్చల సమయంలో ఉద్యోగులను రెచ్చగొట్టేలా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలను కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెట్టిందనే రీతిలో బొప్పరాజు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడుదల చేసిన నిధుల గురించి బొప్పరాజు ప్రస్తావించకపోవడం చూస్తుంటే ఆయన ధోరణి ఏంటో అర్థమవుతోంది. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై పూర్తి చిత్తశుద్ధితో ఉంది. తీవ్రమైన ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలోని పెండింగ్ బిల్లులను కూడా ఇప్పటికే చాలా వరకు చెల్లించాం" అని మంత్రి అనగాని వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడం వెనుక ఆయన ఉద్దేశాలు వేరే ఉన్నాయని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు.

# ఆమ్ ఆద్మీ జిల్లా మాజీ కన్వీనర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా మాజీ కన్వీనర్ ఇలపంధ చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, డీసీసీ అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మ సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నాయకులు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, యువత, మహిళలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. రాబోయే ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల నుండి బీజేపీ ప్రభుత్వ పతనం మొదలవుతుందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ హవా రాబోతోందని, ఆయన ప్రధాని కాబోతున్నారని అన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, వచ్చే జీవీఎంసీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు,ఐ ఎన్ టీ యూ సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్రిపోతుల ముత్యాలు, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తుల శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు వజపర్తి శ్రీనివాస్, జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు కాండవ గాయత్రి,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గౌతమ్,దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ కేవీ సూర్యనారాయణ, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ రామకృష్ణ,పశ్చిమ నియోజకవర్గం రజియా బేగం,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మణికంఠ, సీనియర్ నాయకులు సునంద దేవి,సోడాదశి సుధాకర్, కస్తూరి వెంకటరావు, చింతపల్లి వెంకటేష్, డొక్కర అప్పారావు, భాష, కాకర అప్పారావు, వేముల సురేష్, ఈగల మోహన్ సాయి, ఫర్వీన్ ఖాన్, పొట్నూరు నాగేంద్ర, సంధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌ను నిర్వహించిన రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి గాను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తు న ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసు కువెళ్లారు. ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమ స్యలపై వినతిపత్రాలు అందజే శారు. అర్జీదారు లతో నేతలు స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్క సమస్యను ఓపిక గా విని వాటిపై అప్పటికప్పుడే సంబంధిత అధి కారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా పరి ష్కార మార్గాలు చూపుతామని ప్రజలకు భరో సా కల్పించారు. కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే ఒకే వేదికపై అర్జీలు స్వీకరించడంపై దర్బార్‌కు హాజరైన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



**అరసవల్లి, పతాకం న్యూస్:** శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రజా రవాణాధికారి (డీపీటీవో) సీహెచ్ అప్పలనారాయణ అన్నారు. ఈ మేరకు 27వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి తన కార్యాలయంలో ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 28వ బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారికి ఒక ఏడాది అనుభవం, లైట్ వెహికల్ లైసెన్సు కలిగి, 21 సంవత్సరాలు నిండిన అభ్య ర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, రుసుం తదితర వివరాలకు 93908 86033 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమం లో 1, 2వ డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, పీఆర్వో ఏఎన్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పంచకర్ల



**పెందుర్తి, పతాకం న్యూస్:** పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో జీవీఎంసీ పెందుర్తి జోన్ పారిశుధ్య కార్మికులకు నిత్యవసర సామగ్రి పంపిణీ కార్యక్రమంలో భాగంగా కొబ్బరినూనె మరియు సబ్బులను పంపిణీ చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. ఈ సందర్భంగా వార్డు వీధులు పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని పారిశుధ్య కార్మికులకు తెలియజేయడం జరిగింది.

# ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం రూరల్ పరిధి కరజాడ గ్రామంలో ఇసుకను అక్రమంగా తవ్వుతూ తరలిస్తున్న వారిపై రెవెన్యూ, పోలీస్, గనుల శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో తహసీల్దార్ శిర్ల గణపతి, ఎస్ఐ కేవీ సురేష్, మైనింగ్ ఏపీడీ మాణిక్యాలరావు సిబ్బం దితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇసుక లోడుతో వెళుతున్న రెండు లారీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే సహిం చేది లేదని, ప్రకృతి వనరుల దోపిడీకి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటా మని అధికారులు స్పష్టం చేశారు.

# 'కొండ జోలికి వస్తే పోరాటం తప్పదు'



**జి.సిగడాం, పతాకం న్యూస్:** తమ గ్రామానికి చెందిన కొండ జోలికి వస్తే పోరాడేం దుకు వెనుకడుగువేసేది లేదని నమిడివలస, గదబపాలెం గ్రామాల రైతులు హెచ్చరించారు. కొండ భూముల రక్షణ పోరాట కమిటీ అధ్యక్షుడు ఇజ్జిరోతు రమేష్ ఆధ్వర్యంలో కొండ వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లా డుతూ.. కొండను కాపాడుకొనేం దుకు దశలవారీ పోరా టాలు చేస్తామన్నారు. పరిశ్రమల పేరుతో కొండలు, ప్రకృతి వనరులను కొల్లగొట్టడం సరికాదన్నారు. తక్షణమే రైతులు సాగు చేసుకుంటున్న భూము లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకల మాధవరావు, పోరాట కమిటీ కార్యదర్శి వంకల గణపతి, గోవింద, మధు, జగదీష్, బాలి సత్యం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 51వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2026 ప్రారంభం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు దక్షిణ నియోజకవర్గం లో గల మున్సిపల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి, జనసేన సీనియర్ నాయకులు కోసూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కోసూరు శ్రీనివాసరావుని సాల్వాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా కోసూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగ సాధన వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని.. విద్యార్థి దశ నుండే యోగాను ప్రతి ఒక్కరు అభ్యసించాలని యోగా సాధన ద్వారా శారీరిక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా స్థిరంగా ఉంటుందని తెలియజేశారు... గత సంవత్సరం విశాఖపట్నంలో జాతీయ యోగా దినోత్సవం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు గారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నామని ఆ ప్రోగ్రాం ద్వారా రాష్ట్రంలో అందరికీ యోగా మీద మంచి అవగాహన కలిగిందని ప్రతి ఒక్కరూ యోగాన్ని అభ్యసిస్తున్నారని... దీనికోసం ప్రభుత్వం కూడా అవేర్నెస్ కల్పిస్తుందని కోసూరు శ్రీనివాస్ రావు గారు తెలియజేశారు.. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజంలో యోగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ అమలులో నంబర్ వన్‌గా ఏపీ



**అమరావతి, పతాకం న్యూస్:** పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన కింద యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యూఎల్ఏ) విధానంలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటులో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 1.41 లక్షల కనెక్షన్లు పూర్తయ్యాయని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ (ఎంఎన్ఆర్ఈ)తన నివేదికలో పేర్కొంది. యూఎల్ఏ విధానం కింద తొలి దశలో అనుమతించిన వాటిలో 5 రాష్ట్రాల్లో 2.23 లక్షల యూనిట్లు ఏర్పాటయ్యాయి. దీనికోసం రూ.525.69 కోట్ల రాయితీని కేంద్రం విడుదల చేసింది. ఏపీ తర్వాత స్థానాల్లో ఒడిశా (73,867 యూనిట్లు), తెలంగాణ (7,442యూనిట్లు) ఉన్నాయి. దేశంలో 30 లక్షల యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో సుమారు 16.58 లక్షల యూనిట్ల ఏర్పాటుకు ఎంఎన్ఆర్ఈ ఆమోదం తెలిపింది. అందులో 5.99 లక్షల కనెక్షన్లు ఏపీకే దక్కాయి. పథకం అమలుపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. 2027 మార్చి నాటికి దేశవ్యాప్తంగా మొత్తం కోటి రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. అందుబాటులోకి 1,198 మెగావాట్ల విద్యుత్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని కింద 5.99 లక్షల కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందుతోంది. యూఎల్ఏ విధానం కింద ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుత్తేదారులను నెడ్‌క్యాప్ ఎంపిక చేసి పనులు అప్పగించింది. వాటి ఏర్పాటుకు అయ్యే మొత్తాన్ని డిస్కంలే భరిస్తాయి. రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు తిరిగి చెల్లిస్తుంది. ఒక్కొక్కటి 2 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న 5.99 లక్షల రూఫ్‌టాప్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 1,198.21 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా 25 ఏళ్ల వ్యవధిలో ప్రభుత్వానికి రూ.8,690 కోట్లు ఆదా అవుతుందని ఇంధన శాఖ అంచనా. కేటాయించిన 5.99 లక్షల యూనిట్లలో జూన్ 4 నాటికి దాదాపుగా 2.28 లక్షల యూనిట్లు ఇన్‌స్టాల్ చేసినట్లు విద్యుత్ సంస్థలు తెలిపాయి. వాటిలో 1.41 లక్షల కనెక్షన్లు జాతీయపోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

## పొటాష్ వినియోగంతో అధిక దిగుబడి



**నందిగాం, పతాకం న్యూస్:** వరి సాగులో పొటాష్ వినియోగం రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆత్మ పీడీ కె.జగన్మోహనరావు తెలిపారు. మం డలంలోని దిమ్మిడిజోలలో పూర్వ అభ్యాసన గుర్తింపుపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొటాష్ వినియోగంతో అధిక దిగుబడులు, నాణ్యత, గింజ బరువు, చీడపీడలు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. కలు పు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ, టీడీపీ నాయకులు సలాన కృష్ణారావు, పాపినాయుడు, వీఏఏ ధరణ్ పాల్గొన్నారు.

## నేడు నీట్ పీజీ పరీక్ష..ఏర్పాట్లు పూర్తి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** నరసన్నపేట కోర్ టెక్నాలజీ కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న నీట్ పీజీ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కోర్ టెక్నాలజీ కేంద్రాన్ని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, జనరేటర్ సౌకర్యంతోపాటు పరీక్ష కేంద్రంలో వెలుతురు, గాలి వంటి సదుపాయంపై అడిగి తెలుసుకొన్నారు. పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, పోలీసు అధికారులకు సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రం పరిధిలో ఎటువంటి ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలు తెరవకుండా పోలీసులు పర్యవేక్షించాలని కోరారు. వైద్యఆరోగ్యసిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సులువుగా వచ్చే విధంగా పలు కూడళ్లు వద్ద సమాచార బ్యానర్లు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, ఎస్ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురు కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులు

**అమరావతి, పతాకం న్యూస్:** ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ (ఐఆర్‌సీఎస్)తో సమన్వయం చేసుకుని జిల్లాల్లో అద్భుతమైన సేవలకు గుర్తింపుగా ఏడుగురు కలెక్టర్లకు గవర్నర్ గోల్డ్ మెడల్స్ లభించాయి. ఐఆర్‌సీఎస్ జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ అవార్డులను ప్రకటించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సెప్టెంబరు 1న జరగనున్న ఐఆర్‌సీఎస్ రాష్ట్రశాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మెడల్స్‌ను కలెక్టర్లకు ప్రదానం చేయనున్నారు. ఈ జాబితాలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా, బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్, కృష్ణా కలెక్టర్ డి.కె.బాలాజీ, కాకినాడ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్, నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి ఉన్నారు.

# ఆశావహుల్లో సందడి..



**పలాస, పతాకం న్యూస్:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈసారి కొత్తగా నాలుగు వార్డులు వచ్చి చేరాయి. మొత్తం 36 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వార్డులు పెరగడంతో ఆశావాహుల్లో సందడి నెలకొంది. మున్సిపాలిటీకి సమీపంలో ఉండే శాసనం పంచాయతీతో పాటు ఎన్టీయార్ గృహ సముదాయం (కోసంగిపురం రోడ్డు), ఏహెచ్‌పీ గృహ సుముదాయం ప్రాంతాలపై ఇంకా అధికారులు నిర్ణయం తీసుకోలేదు. వీటిల్లో మొత్తం మున్సిపాలిటీకి చెందిన ఓటర్లే ఉండడంతో ఆయా ప్రాంతాలపై తొందరగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే పలాస-కాశీబుగ్గ గ్రేడ్-1 మున్సిపాలిటీగా అవతరించడం ఖాయమని అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీలో గతంలో 32 వార్డులు ఉండేవి. పరిపాలన సౌలభ్యం, వార్డుల విభజన తరువాత అదనంగా నాలుగు వార్డులను పెంచుతూ మొత్తం 36 వార్డులను చేసి హద్దులు నిర్ణయించారు. కొత్తగా కోసంగిపురం, పాయకరామ్‌పురం, వెంకటేశ్వరకాలనీ వార్డులతో పాటు ఇందిరానగర్, సూదికొండకాలనీ కలిసి ఒక వార్డుగా ఏర్పడింది. గతంలో ఇరు పార్టీల్లోనూ టిక్కెట్లు ఆశించి వేరు కుంపటి పెట్టిన నాయకులకు కొత్తగా ఏర్పడిన నాలుగు వార్డులతో అవకాశాలు లభించనున్నాయి. పట్టణానికి ఆనుకొని ఉన్న శాసనం వాస్తవానికి మున్సిపాలిటీలో విలీనం కావాల్సి ఉంది. అప్పట్లో ప్రజాప్రతినిధుల నుంచి సుముఖత వ్యక్తం కావడంతో దీన్ని లొద్దబద్ర పంచాయతీలోనే ఉంచారు. గత ఎన్నికల్లో మున్సిపాలిటీలో చేరుతుందని భావించి అక్కడ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. ఇటీవల శాసనం గ్రామస్థులంతా తమను మున్సిపాలిటీలో విలీనం చేసినా ఇబ్బందులు లేవని లేఖలు ఇచ్చారు. అయితే, అప్పటికే 36 వార్డుల ముసాయిదా పూర్తి కావడంతో ఈ పంచాయతీపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. అదేవిధంగా కొత్తగా కోసంగిపురం రోడ్డులో ఏర్పాటయిన ఎన్టీఆర్ గృహ సముదాయం కూడా మున్సిపాలిటీలో విలీనం చేయాల్సి ఉంది. అక్కడ 3వేలకు పైగా గృహాలు ఉండడంతో ఏకంగా రెండు వార్డులను చేయడానికి అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించకపోవడంతో వారు పంచాయతీలో ఉన్నారా, మున్సిపాలిటి పరిధిలోకి వస్తారో ఇంకా స్పష్టత లేదు. ఏహెచ్‌పీ గృహసముదాయం కూడా పూర్తిగా పురపాలక పరిధిలోకి రావాల్సి ఉంది. మున్సిపాలిటీకి చెందిన వారికే ఇక్కడ మొత్తం గృహాలు కేటాయించారు. దీంతో ఆ ప్రాంతం మున్సిపాలిటీకి చెందిందే. కానీ, దీనిపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ మూడు ప్రాంతాలు విలీనం జరిగితే కొత్తగా మరో నాలుగు వార్డులు పెరిగే అవకాశం ఉంది.

## నేపాల్ వరదలు.. 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు.. 400 మంది సురక్షితం

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** నేపాల్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా 320 మంది భారతీయులతో సంబంధాలు తెగిపోయాయని, వారి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. అయితే, చైనా వైపున చిక్కుకున్న మరో 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ నిన్న మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వరదల బారి నుంచి ఇప్పటివరకు 84 మంది భారతీయులను సురక్షితంగా కాపాడినట్లు ఆయన తెలిపారు. వీరిలో త్రిశూలి-1 హైడ్రోపవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది, తమిళనాడుకు చెందిన మరో 21 మంది ఇండిగో విమానంలో ఢిల్లీకి చేరుకున్నారని పేర్కొన్నారు. చైనా వైపు చిక్కుకున్న వారిలో ఇప్పటికే 96 మంది నేపాల్ సరిహద్దుల్లోకి ప్రవేశించారని, మిగిలిన వారి తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. చైనాలో ఉన్న 400 మంది తమ కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా సంప్రదింపుల్లో ఉన్నారని, వారిని సురక్షితంగా తరలించేందుకు చైనాలోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని జైస్వాల్ తెలిపారు. మరోవైపు, భారత సంతతికి చెందిన (ఇతర దేశాల పౌరసత్వం ఉన్న) సుమారు 100 మంది ఆచూకీ కూడా ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. నేపాల్-చైనా సరిహద్దుల్లోని నదిలో హిమపాతం కారణంగా ఈ భారీ వరదలు సంభవించాయి. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 538 మంది మరణించినట్లు నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటించింది. న్యూఢిల్లీ, కాఠ్‌మండు, బీజింగ్‌లలోని భారత రాయబార



కార్యాలయాలు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.

## ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమం



**అమరావతి, పతాకం న్యూస్:** ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమానికి సమాయత్తమైంది. ఈ మేరకు ఈ నెల 31 నుంచి ఉద్యమాన్ని రెండు దశల్లో నిర్వహిస్తున్నట్లు అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర సదస్సు నిర్వహించింది. అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు జరిగిన ఈ సదస్సుకి రాష్ట్ర కార్యవర్గంతో పాటు 28 జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ, రాష్ట్ర మున్సిపల్ విద్యుత్, వైద్య, ఆర్టీసీ, గ్రామ సచివాలయల ఉద్యోగ సంఘాలు, ఏఐటీయూసీ, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వ చర్యలపై చర్చ అనంతరం అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యమ కార్యచరణ ప్రకటించారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 26 వరకు రెండు దశల్లో ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు బొప్పరాజు తెలిపారు. మొదటి దశ ఉద్యమం ఈ 31 నుంచి సెప్టెంబర్ 11 వరకు, రెండో దశ ఉద్యమాన్ని 16 నుంచి 26 వరకు చేపడతామన్నారు. ఉద్యమ కార్యాచరణ నోటీసుని ప్రభుత్వానికి అందించి ఉద్యమానికి ఈ రోజే నాంది పలుకుతామన్నారు. మొదటి దశలో ఈ నెల 31న జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులంతా ఊరేగింపుగా తరలిపోయి కలెక్టర్లకు నోటీసులు ఇస్తామన్నారు. సెప్టెంబర్ 1న "సీఎం సర్ మా డబ్బులు మాకు ఇవ్వండి సర్" అంటూ వాట్సాప్ డీపీ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనతో పాటు ఉద్యమానికి ఇతర సంఘాలకు ఆహ్వానం పలుకుతామన్నారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్యాలయాల ముందు ధర్నా చేపడతామన్నారు. 11న అన్ని జిల్లాల్లో అన్ని సంఘాలను కలుపుకొని రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని బొప్పరాజు తెలిపారు. సెప్టంబర్ 15 నుంచి 26 వరకు రెండో దశ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా వర్క్ టూ రూల్. సెల్ ఫోన్ల ద్వారా ఫొటోలు, రీల్స్ చేసి మా డబ్బులు మాకు ఇవ్వాలని వీడియోలు అప్?లోడ్ చేస్తామన్నారు. బకాయిలపై ప్రజా ప్రతినిధులను అభ్యర్థిస్తామన్నారు. నల్ల కండువాలతో జిల్లా, డివిజనల్ ప్రధాన కూడల్లలో మానవ హారాలు చేపడతామన్నారు. 23న కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఉద్యోగుల ధర్నా చేస్తామన్నారు. 26న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా జరుపుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పటికైనా ఉద్యోగులు, పెన్షనర్లు, ఒప్పంద, ఔట్ సోర్స్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఇతర ఉద్యోగ, ప్రజా సంఘాలను కలుపుకొని మూడోదశ ఉద్యమాన్ని ప్రకటిస్తామని అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలియచేసారు. రాష్ట్రంలోని ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలేదని బొప్పరాజు అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఆర్థిక ప్రయోజనాలు, మధ్యంతర భృతి, డీఏలు, పీఆర్సీ తదితర న్యాయమైన హక్కులను పదేపదే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదన్నారు.

## ఫుడ్ ప్యాకెట్లపై ఇక రెడ్ వార్నింగ్.. సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలక ప్రతిపాదన




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు, శీతల పానీయాలపై త్వరలోనే ఎరుపు రంగు హెచ్చరిక గుర్తులు (లేబుల్స్) కనిపించనున్నాయి. ఉప్పు, చక్కెర లేదా కొవ్వు పదార్థాలు పరిమితికి మించి ఉన్న ఉత్పత్తుల ప్యాకెట్ల ముందరి భాగంలో ఈ హెచ్చరికలను ముద్రించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. వినియోగదారులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడంలో ఈ నిర్ణయం తోడ్పడుతుందని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఈ ప్రతిపాదన ప్రకారం.. ప్యాకెట్లపై 'హై ఫ్యాట్', 'హై షుగర్', 'హై సాల్ట్' లేదా 'హైలీ స్వీటెన్డ్ బేవరేజ్' వంటి హెచ్చరికలు స్పష్టంగా కనిపించేలా ముద్రించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎఫ్ఎస్-ఎస్ఏఐ తన ప్రతిపాదనలను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఆహార ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ అంశంలో జరుగుతున్న జాప్యంపై జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వ్యాపార ప్రయోజనాల కంటే ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. అయితే, ఈ నిర్ణయం తమ అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నెస్లే, పెప్సికో, కోకా-కోలా వంటి దిగ్గజ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రెండు వారాల్లోగా ఈ విషయంలో స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన ఫైలింగ్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ వివరాలను వెల్లడించింది.

## వైద్యఆరోగ్యశాఖను ప్రక్షాళన చేస్తా: డీఎంహెచ్‌వో

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అవినీతికి పారదర్శకతతో చెక్‌పెడతానని డీఎంహెచ్‌వో డాక్టర్ ఈవీ నరేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో అవినీతి, గ్రూపు రాజకీయాలు, అక్రమ డిప్యుటేషన్లు, సిబ్బంది వ్యవహారశైలి తదితరవాటిపై స్పందించారు. తనదైన శైలిలో వైద్యరోగ్యశాఖను ప్రక్షాళన చేస్తానని తెలిపారు. 'వైద్య ఆరోగ్యశాఖలో ఎక్కడ, ఏ కేడర్‌లో అవినీతి జరుగుతుందో గుర్తించి పారదర్శకతను తీసుకొస్తాం. పారదర్శకతకు పెద్దపీట వేస్తే అవినీతికి ఆస్కారం ఉండదు. ఓపెన్‌గానే పోస్టుల భర్తీ చేపడతాం' అని అన్నారు.

## తిరుమలలో పోగొట్టుకున్న బ్యాగు భక్తులకు తిరిగి అప్పగింత



**తిరుమల, పతాకం న్యూస్:** శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల టీటీడీ సిబ్బంది మరోసారి తమ నిజాయతీని, సేవాభావాన్ని చాటుకున్నారు. తిరుమల ఘాట్ రోడ్డులో గుంటూరుకు చెందిన ఓ కుటుంబం పోగొట్టుకున్న లక్షల రూపాయల విలువైన నగలు, నగదు ఉన్న బ్యాగును భద్రంగా వారికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. మానవత్వం, బాధ్యత కలగలిసి ఓ భక్తుల కుటుంబంలో ఆనందం నింపిన ఈ ఘటన తిరుమలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా బ్రాడీపేటకు చెందిన పోతుల నారాయణ, సునీత దంపతులు తమ కుటుంబంతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి నుంచి తిరుమల వచ్చే రెండో ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా, తమ బ్యాగును ఎక్కడో జారవిడుచుకున్నారు. ఆ బ్యాగులో 61 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,02,840 నగదుతో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన భూమి ఒప్పంద పత్రాలు ఉన్నాయి. ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఘాట్ రోడ్డుపై వెళుతున్న ఓ బైకర్ ఆ బ్యాగును గమనించారు. వెంటనే దాన్ని తీసుకుని, ఉదయం 6:30 గంటలకు జీఎన్సీ టోల్‌గేట్ వద్ద విధుల్లో ఉన్న హోంగార్డు రెడ్డప్పరావుకు అప్పగించారు. సమాచారం అందుకున్న టీటీడీ భద్రతా సిబ్బంది ఆ బ్యాగును కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి భద్రపరిచారు. మరోవైపు, బ్యాగ్ పోయిందని గుర్తించిన భక్తుల కుటుంబం ఆందోళనతో వెతుకుతూ టీటీడీ అధికారులను సంప్రదించింది. వారు చెప్పిన వివరాలు, అందించిన గుర్తింపు ఆధారాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఆదేశాల మేరకు, ఏవీఎస్వోలు కృష్ణయ్య, వెంకట శివకుమార్‌ల సమక్షంలో బ్యాగును తెరిపించి, అందులోని వస్తువులను యజమానులతో సరిచూయించారు. నగదు, బంగారం, విలువైన పత్రాలు అన్నీ సురక్షితంగా ఉన్నాయని భక్తులు నిర్ధారించుకున్నారు. అనంతరం అధికారులు ఆ బ్యాగును వారికి సురక్షితంగా అప్పగించారు. పోయిందనుకున్న తమ విలువైన వస్తువులు తిరిగి దక్కడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కష్టకాలంలో బాధ్యతగా వ్యవహరించి బ్యాగును అప్పగించిన బైకర్‌కు, సమయస్ఫూర్తితో దానిని భద్రపరిచి తమకు అందజేసిన టీటీడీ భద్రతా సిబ్బందికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



**టెక్కలి, పతాకం న్యూస్:** పీడీఎస్ ఆధ్వర్యంలో చౌకధరల దుకాణ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్య తీసుకోవాలని టెక్కలి మండల రేషన్ డీలర్ల సంఘం డిమాండ్‌చేసింది. టెక్కలి తహసీల్దార్ ఎస్.రాంబాబుకు డీలర్ల సంఘ అధ్యక్షుడు కిమిడి శ్రీనివాసరావు, కార్యదర్శి పందిరి వసంత్‌కుమార్, డీలర్లు నారాయణరావు, విజయలక్ష్మి, చిట్టమ్మ వినతిపత్రం అందజేశారు.

## తక్కువ స్పీడ్ బ్యాటరీ బైకులకు నో రూల్స్!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తక్కువ స్పీడ్‌తో నడిచే బ్యాటరీ బైకులకు మోటారు వాహన నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మోటారు వాహనాల చట్టం-1989లో మార్పులు చేయనుంది. దీనికి సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనలను విడుదల చేసింది. ఈ మేరకు చట్టంలో చేసే సవరణలు ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. 0.6 కేవీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన, గంటకు 25 కిలోమీటర్ల కంటే తక్కువ స్పీడ్‌తో నడిచే బ్యాటరీ బైకులకు మోటారు వాహన నిబంధనల నుంచి మినహాయింపు లభించనుంది. అయితే, కేంద్రీయ రహదారి పరిశోధనా సంస్థలో మాజీ రోడ్డు భద్రతా శాస్త్రవేత్త అయిన వేలుమురుగన్ దీనిపై స్పందిస్తూ కనీసం ఈ వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని అయినా తప్పనిసరి చేస్తే బావుంటుందని సూచించారు.

# పిల్లల్లో బీపీ రావడానికి కారణాలేమిటి?

హైబీపీ (అధిక రక్తపోటు) అనగానే వయస్సు మళ్లిన వారే ఎక్కువగా గుర్తొస్తుంటారు. కానీ, పిల్లలు, యుక్తవయస్సు వారిలోనూ హైబీపీ లక్షణాలు ఉంటాయి. కొందరికి వంశ పారంపర్యంగా, మరికొందరికి ఇతరత్రా జబ్బులతో ఇది రావొచ్చంటున్నారు నిపుణులు. కారణమేదైనా పిల్లల్లో బీపీని నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు. సకాలంలో గుర్తించి, చికిత్స చేయడం మంచిదని చెబుతున్నారు. అయితే, బీపీ ఉన్న పిల్లల్లో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి, కారణాల గురించి తెలుసుకుందాం! పిల్లల బీపీని తరచూ పరీక్షించటం, చిన్నప్పటి నుంచే గుండె ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడే అలవాట్లను నేర్పించటమూ ముఖ్యమేనని తాజా అధ్యయనం సూచిస్తోంది. ఏడేళ్ల వయస్సులో అధిక రక్తపోటు ఉన్న పిల్లలు 50 ఏళ్ల మధ్యలో హృదయ సంబంధ వ్యాధులతో చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ అధ్యయనంలో 1959 నుంచి 1966 మధ్యలో పుట్టిన 38 వేల మందిని ఆరు దశాబ్దాలుగా పరిశీలిస్తూ వచ్చారు. వీరిలో 2016 నాటికి 2837 మంది మరణించగా, 504 మంది చనిపోవటానికి గుండెజబ్బులే కారణమని వెల్లడైంది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు పిల్లల జీవనశైలి గణనీయంగా మారిన నేపథ్యంలో తాజా అధ్యయన ఫలితాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది చాలావరకు ఆరేళ్లు పైబడ్డవారిలోనే కనిపిస్తుందంటున్నారు నిపుణులు. అధిక బరువు, అధిక కొలెస్ట్రాల్, ఉప్పు ఎక్కువగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం, ఎక్కువసేపు కదలకుండా కూర్చోవటం, కుటుంబంలో ఎవరికైనా రక్తపోటు ఉండటం, జన్యు సమస్యలు వంటివన్నీ దీనికి దోహదం చేస్తాయని చెబుతున్నారు.



ఇది ఆరేళ్ల లోపు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఇందుకు కిడ్నీ, రక్తనాళ జబ్బులు అనేవి ఎక్కువగా దోహదం చేస్తాయని చెబుతున్నారు. మెదడు మూలం వద్ద రక్తనాళాల్లో అడ్డంకి, రక్తనాళాలు గోడలు మందంగా, గట్టిగా అవటం (ఆర్టీరియో స్క్లిరోసిస్), గుండె నుంచి రక్తాన్ని తీసుకొచ్చే బృహద్ధమని, దాని శాఖల్లో వాపు ప్రక్రియ తలెత్తటం (టకయాస్ డిసీజ్), మూత్ర ఇన్?ఫెక్షన్లు, మూత్రపిండాల్లో తిత్తులు, వడపోత ప్రక్రియకు తోడ్పడే భాగాలు దెబ్బతినటం, కిడ్నీలకు రక్తన్నీ సరఫరా చేసే రక్తనాళాలు గట్టిపడటం (రీనల్ ఆర్టరీ స్టెనోసిస్) వంటివి హైబీపీకి దారితీస్తాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, కిడ్నీల మీదుండే అడ్రినల్ గ్రంథి వద్ద ఏర్పడే కణితులతోనూ (ఫియోక్రోమోసైటోమా) బీపీ పెరుగుతుందని తెలియజేస్తున్నారు. అలాగే, పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, ముఖ్యంగా బృహద్ధమని సంకోచించటమూ (కోఆర్?క్టేషన్ ఆఫ్ అయోర్టా) హైబీపీకి దారితీస్తుందని వెల్లడిస్తున్నారు. ఈ సమస్యలు చిన్నప్పుడు పెద్దగా ఇబ్బంది పెట్టవని కానీ, వయసు పెరుగు తున్నకొద్దీ ఎక్కువవుతూ వస్తుందని అంటు న్నారు. దీంతో వ్యాయామాలు, కష్టమైన పనులు చేసేటప్పుడు తలకు, చేతులకు రక్తపోటు బాగా పెరిగిపోతుందని చెబుతున్నారు. పిల్లల్లో హైబీపీని కచ్చితంగా నిర్ధారించడం చాలా ముఖ్యం. దీంతో అనవసరంగా మందులు ఇవ్వకుండా జాగ్రత్త పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ఒకసారి పరీక్ష చేస్తే చాలదని, కనీసం రెండు సార్లయినా పరీక్షించాలని అంటున్నారు. రెండు సార్లూ బీపీ ఎక్కువుంటేనే అధిక రక్తపోటు ఉందని అనుకోవచ్చని సూచిస్తున్నారు. ఇలా వేర్వేరు రోజుల్లో కనీసం మూడు సార్లు పరీక్ష చేసి సమస్యను నిర్ధారించాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. అవసరమైతే ఆంబులేటరీ పరికరంతోనూ రోజంతా బీపీని పరిశీలించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. పిల్లల్లో అధిక రక్తపోటు ఉన్నా ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే, తలనొప్పి, వాంతులు, ఛాతీ నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస ఆడకపోవడం లాంటి సంకేతాలతో గుర్తించవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో వీలున్నప్పుడల్లా పిల్లలకు రక్తపోటు పరీక్ష చేయించటం మంచిదంటున్నారు నిపుణులు. ఆటల పోటీలకు వెళ్లే ముందు ఒకసారి రక్తపోటును పరీక్షించటం మేలని చెబుతున్నారు. ఆసుపత్రికి ఎప్పుడు వెళ్లినా, జలుబు, దగ్గు వంటి వాటి కోసం వెళ్లినప్పుడైనా, కనీసం ఏడాదికి ఒకసారైనా బీపీ పరీక్ష చేయటం మేలని సూచిస్తున్నారు. దీర్ఘకాలంగా అధిక రక్తపోటుతో బాధపడే పిల్లలకు గుండె కండరం మందం కావొచ్చంటున్నారు నిపుణులు. ఇది గుండె వైఫల్యానికి దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు.

కిడ్నీలో రక్తనాళాలు దెబ్బతిని, వడపోత ప్రక్రియ అస్తవ్యస్తమవ్వచ్చని చెబుతున్నారు. కంట్లోని రెటీనా దెబ్బతినే ప్రమాదమూ ఉందని పేర్కొంటున్నారు. మెదడుకు రక్త సరఫరా చేసే నాళాలు దెబ్బతింటే తలనొప్పి, తలతిప్పు తలెత్తచ్చని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, రక్తనాళాలు చిట్లిపోయి పక్షవాతం వంటి తీవ్ర సమస్యలూ ముంచుకురావొచ్చని వివరిస్తున్నారు. పిల్లల్లో హైబీపీ చికిత్సలో మందుల కన్నా జీవనశైలి మార్పులకే అధిక ప్రాధాన్యం ఉందంటున్నారు నిపుణులు. తాజా కూరగాయలు, పండ్లు, పీచుతో కూడిన ఇతర పదార్థాలు ఎక్కువగా తినటం, చక్కెరతో చేసే పానీయాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

# వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్..



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ సంచలన ప్రకటన చేశారు. దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాతో చమురు ఒప్పందం కుదిరిందని, దీని ద్వారా ఆ దేశంలోని 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలను అమెరికా నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. "ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం"గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. దీంతో అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది. ఈ నిల్వలు 2026 ప్రారంభం నుంచి 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా తగ్గి, 300 మిలియన్ బ్యారెళ్ల దిగువకు పడిపోయాయి. సుమారు 9 నెలల క్రితం అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ కోసం అమెరికాకు తరలించింది. అనంతరం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్, దేశ చమురు రంగాన్ని ప్రైవేటీకరణకు అనుమతిస్తూ చట్టం చేశారు. దశాబ్దాల సోషలిస్ట్ పాలనకు ఇది పూర్తి విరుద్ధం. ఈ మార్పే తాజా ఒప్పందానికి మార్గం సుగమం చేసింది. ఈ ఒప్పందం ద్వారా వెనెజువెలాలోకి 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయని, అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గుతాయని మార్కో రూబియో 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాల కారణంగా వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఎంతవరకు ముందుకొస్తాయనేది వేచి చూడాలి.

# టూరిజం హబ్‌గా 'సీలేరు'?



**సీలేరు, పతాకం న్యూస్:** సహజసిద్ధ ప్రకృతి అందాలకు నిలయం సీలేరు. ఎత్తైన పచ్చని కొండలు, లోయలు, జలపాతాలు, రిజర్వాయర్లు, జల విద్యుత్ కేంద్రాలు.. ఇలా ఎన్నో అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జీకే వీధి మండలం సీలేరులో సినిమా షూటింగ్‌లకు అనువైన ఎన్నో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయి. ఇటీవల విడుదలైన ఇరుముడి సినిమా షూటింగ్ ఈ ప్రాంతంలో జరిగిందే. కేరళం తరహా సుందర ప్రదేశాలు సీలేరులో ఉన్నాయని ప్రముఖ నటులు రవితేజ, సాయికుమార్, దర్శకుడు శివ నిర్వాణ ప్రతి ఇంటర్వ్యూలో చెబుతుండడంతో ఇప్పుడు అందరి దృష్టి సీలేరుపై పడింది. సీలేరు పేరు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. ఇటీవల విడుదలై విజయవంతమైన ఇరుముడి సినిమా షూటింగ్ ఇక్కడే జరిగిందని తెలిసి సీలేరు గురించి తెలుసుకోవడానికి అందరూ ఆసక్తి చూపుతున్నారు. సీలేరుకు అరకిలోమీటరు దూరంలో మారెమ్మ ఆలయం, కిలోమీటరు దూరంలో గుంటవాడ డ్యామ్, రెండు కిలోమీటర్ల దూరంలో జల విద్యుత్ కేంద్రాలు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఐస్‌గెడ్డ, 17 కిలోమీటర్ల దూరంలో ధారాలమ్మ ఆలయం, అక్కడ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో రెయిన్‌గేజ్, అలాగే సీలేరు నుంచి 50 కిలోమీటర్ల దూరంలో పొల్లూరు జలపాతం ఉన్నాయి. ఇవన్నీ ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతాల్లో గతంలో షూటింగ్ చేసిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్లకు నిలిచాయి. గతంలో సీలేరులో షూటింగ్ చేసిన శోభన్‌బాబు, కాంచన నటించిన కల్యాణ మండపం, కృష్ణ, విజయనిర్మల నటించిన పాడిపంటలు, చంద్రమోహన్, విజయశాంతి నటించిన పెళ్లిచూపులు, తదితర సినిమాలు ఘన విజయం సాధించాయి. ఇటీవల ధారాలమ్మ ఆలయంలో ధీర ధాత్రీ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. సీలేరు ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సీలేరు మారెమ్మ ఆలయం ఎదురుగా ఉన్న గుంటవాడ జలాశయంలో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టు నిర్మించడానికి ఏపీ ఎయిర్ పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాట్లు చేస్తోంది. దీని కోసం గత ఏప్రిల్ 2న ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ ప్రాజెక్టుకు ఈ ప్రాంత వాసులు అనుకూలంగా ఉన్నట్టు ప్రజాభిప్రాయ సేకరణలో తెలిపారు. ధారకొండలో గల ధారాలమ్మ ఆలయాన్ని టెంపుల్ సిటీగా చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

త్వరలో ఇవి కార్యరూపం దాల్చనున్నాయి. సీలేరులో ఇరుముడి షూటింగ్‌లో పాల్గొన్న సందర్భాన్ని ప్రముఖ నటులు రవితేజ, సాయికుమార్, దర్శకుడు శివ నిర్వాణ తరచూ గుర్తు చేసుకుంటున్నారు. తాజాగా పలు ఇంటర్వ్యూల్లో ఈ ప్రాంత అందాల గురించి చెప్పారు. కేరళంలో తరహా అందాలు ఇక్కడ ఉన్నాయని కొనియాడారు. తమిళనాడు, కర్ణాటకకు చెందిన అభిమానులు ఈ ప్రకృతి అందాలను చూడాలంటే ఎలా వెళ్లాలని అడుగుతున్నారని నటుడు సాయికుమార్ ఇటీవల తెలిపారు. ఇక్కడి ప్రజల అభిమానాన్ని మరువలేమని ఆయనతో పాటు రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ పలు సందర్భాల్లో చెప్పారు.




# కుర్రాళ్ల జోరుకు గిల్ ఫుల్ ఖుషీ.. టీమిండియాకు కొత్త బలం!



శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నాడు. రెండో టెస్టు డ్రాగా ముగిసినా, ఈ పర్యటనలో జట్టుకు ఎన్నో మంచి అంశాలు కనిపించాయని తెలిపాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, మానవ్ సుతార్ రాణించడం తనను ఆకట్టుకుందని చెప్పాడు.

సాయి సుదర్శన్ స్థానంలో మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ సిరీస్‌లో అదరగొట్టాడు. రెండు సెంచరీలతో 328 పరుగులు చేశాడు. క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లకు చెబుతుంటామని గిల్ అన్నాడు. పడిక్కల్ అదే చేసి చూపించాడని ప్రశంసించాడు. అతడి ఆట జట్టుకు మంచి సంకేతమని తెలిపాడు. ఎడమచేతి స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పైనా గిల్ ప్రశంసలు కురిపించాడు. సిరీస్‌లో 16 వికెట్లు తీసిన సుతార్ గాలే టెస్టులో పది వికెట్లతో భారత్ 165 పరుగుల విజయానికి కీలకంగా నిలిచాడు. అతడు భవిష్యత్తులో భారత స్పిన్ దాడికి చాలా కాలం నాయకత్వం వహించే ఆటగాడిగా ఎదుగుతాడని గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ వికెట్లు తీసే అవకాశం కల్పిస్తున్నాడని అన్నాడు. రెండో టెస్టు డ్రా కావడం మాత్రం నిరాశ కలిగించిందని గిల్ చెప్పాడు. రెండో రోజు ఆట ముగిసే సరికి గెలుస్తామని భావించామని తెలిపాడు. కానీ చివరి మూడు రోజులు శ్రీలంక అద్భుతంగా పోరాడిందని ప్రశంసించాడు. ప్రత్యర్థి ఆట నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలని అన్నాడు. ఈ సిరీస్ నుంచి మంచి అనుభవం దక్కిందని, న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో మరింత మెరుగ్గా ఆడతామని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

# దక్షిణాఫ్రికాకు షాకిచ్చిన పసికూన నమీబియా



విండ్‌హోక్‌లోని నమీబియా క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టీ20 ట్రై-నేషన్ సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో పసికూన నమీబియా సంచలనం సృష్టించింది. పటిష్ఠమైన దక్షిణాఫ్రికా జట్టుపై 18 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. 164 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టును 145/9 స్కోరుకే కట్టడి చేసి ఈ సిరీస్‌లో బోణీ కొట్టింది. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 మ్యాచ్‌లలో నమీబియా తమ 2-0 ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. నమీబియా విజయంలో బౌలర్లు రూబెన్ ట్రంపెల్‌మన్, జేజే స్మిత్ కీలక పాత్ర పోషించి చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ బ్యోర్న్ ఫోర్టుయిన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, నమీబియా ఓపెనర్లు లూరెన్ స్టీన్‌క్యాంప్, జాన్ ఫ్రైలింక్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. తొలి వికెట్‌కు కేవలం 9.4 ఓవర్లలోనే 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. స్టీన్‌క్యాంప్ 41 పరుగుల వద్ద ఔటవ్వగా, ఫ్రైలింక్ 60 పరుగులతో రాణించాడు. ఆ తర్వాత కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (19), అలెగ్జాండర్ బుసింగ్-వోల్‌షెంక్ (13), ట్రంపెల్‌మన్ (12) చేసిన చిన్నపాటి పరుగులు జట్టు స్కోరును 163/9కి చేర్చడంలో తోడ్పడ్డాయి. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్లు జోర్డాన్ హెర్మన్ (7), లువాన్-డ్రే ప్రిటోరియస్ (9) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్ చేరారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన డేవిడ్ బ్రెవిస్ 75 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. అయితే, మరో ఎండ్‌లో వికెట్లు పడుతూనే ఉండటంతో దక్షిణాఫ్రికా 86 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత బ్రెవిస్‌కు జత కలిసిన డువాన్ జాన్సెన్ 47 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టులో ఆశలు రేపాడు. చివరి 13 బంతుల్లో 31 పరుగులు అవసరమైన దశలో బ్రెవిస్‌ను ట్రంపెల్‌మన్ ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరి ఓవర్‌లో కెప్టెన్ ఎరాస్మస్ కేవలం మూడు పరుగులే ఇచ్చి ఫోర్టుయిన్‌ను ఔట్ చేశాడు. ఆఖరి ఓవర్ తొలి రెండు బంతులకు జాన్సెన్ (25 నాటౌట్) ఎనిమిది పరుగులు చేసి ఉత్కంఠ రేపినా, స్మిత్ మిగిలిన బ్యాటర్లను ఔట్ చేసి నమీబియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దక్షిణాఫ్రికా నేడు జింబాబ్వేతో తమ తదుపరి మ్యాచ్ ఆడనుంది.




# శర్వానంద్ 'భోగి'లో ఐదుగురు అక్కాచెల్లెళ్లు



శర్వానంద్ హీరోగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోగి'పై ఆసక్తి మరింత పెరుగుతోంది సినిమాలో శర్వానంద్ పోషిస్తున్న గంగ పాత్రకు ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారని దర్శకుడు వెల్లడించారు. ఐదుగురు సోదరీమణులతో గంగ ఉన్న పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన సంపత్ నంది.. వారిని 'భోగి'కి ఆత్మలాంటి పాత్రలుగా అభివర్ణించారు. "ఫైవ్ సిస్టర్స్.. వన్ వరల్డ్.. వన్ హార్ట్‌బీట్" అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలే సినిమాకు మరో కొత్త పాటను రికార్డ్ చేసినట్లు సంపత్ నంది వెల్లడించారు. ఆస్కార్ అవార్డు విజేత చంద్రబోస్ సాహిత్యం, భీమ్స్ సిసిరోలియో సంగీతంతో రూపొందిన ఈ పాటను 'టైమ్‌లెస్ జెమ్'గా దర్శకుడు పేర్కొన్నారు. 'భోగి' కోసం ఇప్పటికే భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. జులైలో 22 రోజుల పాటు వరుసగా క్లైమాక్స్ షూటింగ్ నిర్వహించారు. భారీ సెట్‌లో చిత్రీకరించిన ఈ సన్నివేశంలో 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నట్లు చిత్రబృందం తెలిపింది. యాక్షన్ కొరియోగ్రఫీని దిలీప్ సుబ్బరాయన్ రూపొందించారు. గంగ పాత్ర కోసం శర్వానంద్ రోజూ రెండున్నర గంటలకు పైగా మేకప్ వేసుకోవడంతో పాటు, షూటింగ్ పూర్తయ్యాక దాదాపు గంట సమయం మేకప్ తొలగించుకోవడానికి పట్టేదని సమాచారం. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. అనుపమ.. కందుల సులోచన రాణి పాత్రలో, డింపుల్.. మందారం పాత్రలో కనిపించనున్నారు.

1960ల ప్రారంభ కాలం నేపథ్యంలో 'భోగి' కథ సాగుతుంది. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది.

# 'టాక్సిక్' ఫలితంపై నయనతార స్పందన



కన్నడ రాకింగ్ స్టార్ యశ్, నయనతార తదితరులు నటించిన చిత్రం 'టాక్సిక్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనలు అందుకుంటోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో రకరకాల విమర్శలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నయనతార స్పందించారు.

సినిమా ఫలితాల గురించి మాట్లాడుతూ... "పరిశ్రమలో ఉన్న అనుభవం ఒక సినిమాను ఎలా తీస్తారనే దానిపై ప్రాథమిక అవగాహన ఇస్తుంది కానీ, సినిమా అనేది ఎంతో భావోద్వేగభరితమైనది, ఊహించని మలుపులతో కూడుకున్నది. నా కెరీర్‌లో కచ్చితంగా పెద్ద హిట్ అవుతాయని కొండంత ఆశలు పెట్టుకున్న కొన్ని సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అదే సమయంలో, కొన్ని చిత్రాల ఫలితంపై నాకే సందేహాలు ఉండేవి కానీ, అవి బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో భారీ విజయాలు సాధించి ఆశ్చర్యపరిచాయి" అని తెలిపారు.

ఈ ఒడిదొడుకుల నుంచి తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠం గురించి చెబుతూ... "చిత్ర పరిశ్రమలో నా ఇన్నేళ్ల ప్రయాణం ఒక విషయాన్ని నేర్పింది. సినిమా విజయమైనా, అపజయమైనా రెండింటినీ ఒకే విధంగా, వినయంతో స్వీకరించడం నేను నేర్చుకున్నాను" అని స్పష్టం చేశారు.






# 'మహేంద్రగిరి వారాహి' ట్రైలర్ విడుదల



విభిన్నమైన కథలను ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్న హీరో సుమంత్, తాజాగా నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. హైదరాబాదులో నేడు జరిగిన ఈవెంట్ లో ట్రైలర్ ను ఆవిష్కరించారు. పురాణం, ఆధునిక మిస్టరీ అంశాలను జోడించి రూపొందించిన ఈ ట్రైలర్, ప్రేక్షకులలో సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కథాంశం చాలా ఆసక్తికరంగా ఉంది. మహేంద్రగిరి రాజవంశానికి వారాహి అమ్మవారి శాపం ఉంటుంది. ఆ శాపం కారణంగా ఆ వంశంలో పుట్టిన ఏ మగ సంతానం కూడా 33 ఏళ్ల వయసు దాటి బ్రతకదు. ఈ వింత శాపం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు రంగంలోకి దిగిన ఒక పురావస్తు శాస్త్రవేత్త లేదా చరిత్రకారుడి పాత్రలో సుమంత్ కనిపించనున్నారు. ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో, థ్రిల్లింగ్ అంశాలతో నిండి ఉంది. శాపం వెనుక ఉన్న దైవిక రహస్యాన్ని సుమంత్ పాత్ర ఎలా ఎదుర్కొంటుంది అనేదే ఈ చిత్ర కథ. ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేశ్, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల, అలీ, మంజు భార్గవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువ నటుడు సిద్ధు జొన్నలగడ్డ ఈ చిత్రంలో గెస్ట్ రోల్ లో కనిపించనుండటం విశేషం. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా, రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిల్మ్స్ పతాకాలపై మధు కలిపు, లక్ష్మణ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఇప్పటికే జూన్‌లో విడుదలైన టీజర్ మంచి బజ్‌ను క్రియేట్ చేయగా, తాజాగా వచ్చిన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. అన్నపూర్ణ స్టూడియోస్‌లో పోస్ట్-ప్రొడక్షన్ పనులు జరుపుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**